रजिस्ट्री सं डी—२२१
Registered No. D-221
రిజిస్ట్రీ సంఖ్య డి--221

मूल्य रु 5.00 पैसे
[Price Rs.15.00 Paise.
మూల్యము : రూ.15.00 పైసలు

# भारत का राजपत्र
# The Gazette of India
# భారత రాజపత్రము

असाधारण
EXTRAORDINARY
అసాధారణ

भाग XVI अनुभाग 1
Part XVI Section 1
భాగము XVI అనుభాగము 1

प्राधिकार से प्रकाशित
PUBLISHED BY AUTHORITY
ప్రాధికారము ద్వారా ప్రచురింపబడినది

| | | | | |
|---|---|---|---|---|
| सं २ | नई दिल्ली | सोमवार | ४ जूलई २०११/२३ जेष्ठा | संण्ड १९ |
| No. 2 | New Delhi | Monday | 4 July, 2011/23 Jyeshtha | Vol. 19 |
| సంఖ్య 2 | న్యూఢిల్లీ | సోమవారము | 4 జూలై 2011 / 23 జ్యేష్ఠ | సంపుటము 19 |


## MINISTRY OF LAW AND JUSTICE
## (LEGISLATIVE DEPARTMENT)

New Delhi, 22nd March, 2011/Chaitra, 1933 Khara.

The Translation in Telugu of the following Acts namely:-

(1) The Advocates Act, 1961 [Act No.25 of 1961] (2) The Child Labour (Prohibition and Regulation) Act, 1986 [Act No. 61 of 1986] (3) The Designs Act, 2000 [Act No.16 of 2000] (4) The Commissions for Protection of Child Rights Act, 2005 [Act No. 4 of 2006] and (5) The State Emblem of India (Prohibition of Improper Use) Act, 2005 [Act No.50 of 2005] are hereby published under the authority of the President and shall be deemed to be the Authoritative Texts thereof in Telugu under Clause (a) of Section 2 of the Authoritative Texts (Central Laws) Act, 1973 (Act 50 of 1973).

## శాసన మరియు న్యాయపాలన మంత్రిత్వ శాఖ
## (శాసన నిర్మాణ విభాగము)

ఈ క్రింది చట్టములు, అనగా,

(1) అడ్వొకేట్ల చట్టము, 1961 (1961లోని 25వ చట్టము) (2) బాల శ్రామికుల (నిషేధ మరియు క్రమబద్ధీకరణ) చట్టము, 1986 (1986లోని 61వ చట్టము) (3) డిజైనుల చట్టము, 2000 (2000లోని 16వ చట్టము) (4) బాలల హక్కుల రక్షణ కమీషన్ల చట్టము, 2005 (2006లోని 4వ చట్టము) మరియు (5) భారత ప్రతీక (అనుచితముగా ఉపయోగించుటను నిషేధించుటకైన) చట్టము, 2005 (2005లోని 50వ చట్టము)ల యొక్క తెలుగు అనువాదములను రాష్ట్రపతి ప్రాధికారము క్రింద ఇందుమూలముగా ప్రచురించడమైనది. ఆ చట్టములకు గల ఈ అనువాదములను ప్రాధికృత పాఠముల (కేంద్ర శాసనముల) చట్టము 1973 (1973లోని 50వ చట్టము) యొక్క 2వ పరిచ్ఛేదములోని ఖండము (ఏ) క్రింద, ప్రాధికృత తెలుగు పాఠములైనట్లు భావించవలెను.

# అడ్వకేట్ల చట్టము, 1961

## 1961లోని 25వ చట్టము.

[19 మే, 1961]

న్యాయవాదులకు సంబంధించిన శాసనమును సవరించి, ఏకీకరించుటకును మరియు బార్ కౌన్సిళ్లను, అఖిల భారత న్యాయవాదుల సంఘము సంఘటితము గురించి నిబంధించుటకైన చట్టము.

భారత గణరాజ్యపు పన్నెండవ సంవత్సరములో పార్లమెంటుచే ఈ క్రింది విధముగా శాసనము చేయబడినది:-

### అధ్యాయము - I

### ప్రారంభిక

సంగ్రహనామము, విస్తరణ మరియు ప్రారంభము.

1. (1) ఈ చట్టమును అడ్వకేట్ల చట్టము, 1961 అని పేర్కొనవచ్చును.

(2) ఇది యావద్భారతదేశమునకు విస్తరించును.

(3) ఇది, ఉప-పరిచ్ఛేదము (4)లో నిర్దేశించినవి కానట్టి రాజ్య క్షేత్రములకు సంబంధించి, కేంద్రప్రభుత్వము, అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా నియతము చేయునట్టి తేదీన అమలులోనికి వచ్చును మరియు ఈ చట్టములోని వేర్వేరు నిబంధనలకు వేర్వేరు తేదీలను నియతము చేయవచ్చును.

(4) జమ్ము, కాశ్మీరు రాజ్యమునకు మరియు గోవా, డామన్ మరియు డయ్యూ సంఘ రాజ్య క్షేత్రమునకు సంబంధించి, కేంద్ర ప్రభుత్వము, అధికారిక రాజపత్రములో అధిసూచన ద్వారా, నియతము చేయునట్టి తేదీన అమలులోనికి వచ్చును. మరియు ఈ చట్టములోని వేర్వేరు నిబంధనలకు వేర్వేరు తేదీలను నియతము చేయవచ్చును.

నిర్వచనములు.

2. (1) ఈ చట్టములో, సందర్భమునుబట్టి అర్థము వేరుగా ఉన్ననే తప్ప,-

(ఎ) "అడ్వకేటు" అనగా ఈ చట్టపు నిబంధనల క్రింద ఏదేని జాబితాలో నమోదు చేయబడిన అడ్వకేటు అని అర్థము;

(బి) ఈ చట్టపు ఏదేని నిబంధనకు సంబంధించి "నియత తేదీ" అనగా ఆ నిబంధన అమలులోనికి వచ్చు దినము అని అర్థము;

(సి) * * * *

(డి) "బార్ కౌన్సిలు" అనగా ఈ చట్టము క్రింద సంఘటితము చేసిన బార్ కౌన్సిలు అని అర్థము;

(ఇ) "భారతదేశపు బార్ కౌన్సిలు" అనగా ఈ చట్టము విస్తరించు క్షేత్రములకు 4వ పరిచ్ఛేదము క్రింద సంఘటితము చేసిన బార్ కౌన్సిలు అని అర్థము;

(ఎఫ్) * * * *

(జి) "ఉన్నత న్యాయస్థానము" అను పదపరిధిలో 34వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1), (1ఏ) లోను మరియు 42, 43 పరిచ్ఛేదములలో తప్ప,

న్యాయిక కమీషనరు న్యాయస్థానము చేరిఉండదు. మరియు రాజ్య బార్ కౌన్సిలుకు సంబంధించి,-

(i) ఒక రాజ్యమునకు లేక ఒక రాజ్యము మరియు ఒకటి లేక అంతకు మించిన సంఘ రాజ్య క్షేత్రములకు సంఘటితము చేయబడిన బార్ కౌన్సిలు విషయములో, రాజ్యము కొరకైన ఉన్నత న్యాయస్థానము అనియు;

(ii) ఢిల్లీకి సంఘటితము చేయబడిన బార్ కౌన్సిలు విషయములో, ఢిల్లీ యొక్క ఉన్నత న్యాయస్థానము అనియు

అర్థము;

(హెచ్) "న్యాయ శాస్త్ర పట్టభద్రుడు" అనగా శాసనము ద్వారా భారత దేశములో స్థాపించబడిన ఏదేని విశ్వవిద్యాలయము నుండి న్యాయశాస్త్ర బాచిలర్ డిగ్రీ పొందిన వ్యక్తి అని అర్థము;

(ఐ) "న్యాయవాది" అనగా అడ్వకేటు లేక వకీలు, ఏదేని ఉన్నత న్యాయస్థానము యొక్క ప్లీడరు, ముఖ్తారు లేక రెవిన్యూ ఏజెంటు అని అర్థము;

(జె) "విహిత" అనగా ఈ చట్టము క్రింద చేసిన నియమముల ద్వారా విహిత-పరచబడిన అని అర్థము;

(కె) "జాబితా(రోల్)" అనగా ఈ చట్టము క్రింద తయారు చేయబడి నిర్వహించ బడుచున్న అడ్వకేట్ల జాబితా (రోల్) అని అర్థము;

(ఎల్) "రాజ్యము" అను పదపరిధిలో సంఘ రాజ్య క్షేత్రము చేరిఉండదు;

(ఎమ్) "రాజ్యబార్ కౌన్సిల్" అనగా 3వ పరిచ్ఛేదము క్రింద సంఘటితము చేయబడిన బార్ కౌన్సిలు అని అర్థము;

(ఎన్) "రాజ్య జాబితా (రోల్)" అనగా 17వ పరిచ్ఛేదము క్రింద రాజ్య బార్ కౌన్సిలుచే తయారుచేయబడి నిర్వహించబడుచున్న అడ్వకేట్ల జాబితా (రోల్) అని అర్థము;

(2) జమ్మూ మరియు కాశ్మీరు రాజ్యములోను లేక గోవా, డామన్ మరియు డయ్యూ సంఘ రాజ్య క్షేత్రములోను అమలులో లేని శాసనమునకు ఈ చట్టములోని ఏదేని నిర్దేశమును, ఆ రాజ్యము లేక ఆ క్షేత్రమునకు సంబంధించి, ఆ రాజ్యములో లేక సందర్భానుసారము, ఆ క్షేత్రములో, తదనురూపమైన శాసనమేదేని అమలునందున్నచో, దానికి నిర్దేశముగా అన్వయించు కొనవలెను.

## అధ్యాయము - II

## బార్ కౌన్సిళ్లు

రాజ్యబార్ కౌన్సిళ్లు.

3.(1) (ఎ) ఆంధ్రప్రదేశ్, బీహారు, గుజరాతు, జమ్మూ మరియు కాశ్మీరు, మధ్యప్రదేశ్, కర్నాటక, ఒరిస్సా, రాజస్థాన్ మరియు ఉత్తరప్రదేశ్ రాజ్యములకు ఒక్కొక్క దానికి ఆ రాజ్య బార్ కౌన్సిలు అని పిలువబడు;

(బి) అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, మణిపూర్, మేఘాలయ, మిజోరాం, నాగాలాండు మరియు త్రిపుర రాజ్యములకు అస్సాం, నాగాలాండు, మేఘాలయ, మణిపూరు, త్రిపుర, మిజోరాం మరియు అరుణాచల్ ప్రదేశ్ బార్ కౌన్సిలు అని పిలువబడు;

(సి) కేరళ రాజ్యమునకు మరియు సంఘ రాజ్య క్షేత్రమైన లక్షద్వీప్‌కు మినిక్వాయ్ మరియు అమినిదివి ద్వీపములు కేరళ బార్ కౌన్సిలు అని పిలువబడు;

(సిసి) తమిళనాడు రాజ్యమునకు, పాండిచేరి సంఘ రాజ్య క్షేత్రమునకు మద్రాసు బార్ కౌన్సిలు అని పిలువబడు;

(సిసిసి) మహారాష్ట్ర మరియు గోవా రాజ్యములకు మరియు దాద్రా మరియు నాగర్ హవేలీ మరియు డామన్ మరియు డయ్యు సంఘ రాజ్యక్షేత్రములకు మహారాష్ట్ర మరియు గోవా బార్ కౌన్సిలు అని పిలువబడు;

(డి) పంజాబ్ మరియు హర్యానా రాజ్యములకు మరియు ఛండీగర్ సంఘ రాజ్య క్షేత్రమునకు పంజాబ్ మరియు హర్యానా బార్ కౌన్సిలు అని పిలువబడు;

(డిడి) హిమాచల్ ప్రదేశ్ రాజ్యమునకు హిమాచల్ ప్రదేశ్ బార్ కౌన్సిలు అని పిలువబడు;

(ఇ) పశ్చిమ బెంగాలు రాజ్యమునకు మరియు సంఘ రాజ్యక్షేత్రమైన అండమాన్ మరియు నికోబార్ దీవులకు పశ్చిమ బెంగాలు బార్ కౌన్సిలు అని పిలువబడు; మరియు

(ఎఫ్) సంఘ రాజ్య క్షేత్రమైన ఢిల్లీకి ఢిల్లీబార్ కౌన్సిలు అని పిలువబడు బార్ కౌన్సిలు ఉండవలెను.

(2) రాజ్య బార్ కౌన్సిలు ఈ క్రింది సభ్యులతో కూడి ఉండును, వారెవరనగా:-

(ఎ) ఢిల్లీకి సంబంధించిన రాజ్య బార్ కౌన్సిలు విషయములో, భారత అదనపు సొలిసిటరు జనరలు, పదవీ రీత్యా; అస్సాం, నాగాలాండు, మేఘాలయ, మణిపూరు మరియు త్రిపురకి సంబంధించిన రాజ్య బార్ కౌన్సిలు విషయములో, అస్సాం, మణిపూర్, మేఘాలయ, నాగాలాండు మరియు త్రిపుర రాజ్యముల అడ్వకేటు జనరలు పదవీ రీత్యా; పంజాబు మరియు హర్యానాకి సంబంధించిన రాజ్య బార్ కౌన్సిలు విషయములో, పంజాబు మరియు హర్యానా రాజ్యముల అడ్వకేటు జనరల్ పదవీ రీత్యా; మరియు ఏదేని ఇతర రాజ్యబార్ కౌన్సిలు విషయములో, రాజ్య అడ్వకేటు జనరలు పదవీ రీత్యా;

(బి) ఐదు వేలకు మించని ఓటర్లు ఉన్న రాజ్య బార్ కౌన్సిలు విషయములో పదిహేను మంది సభ్యులు,

ఐదువేలకు మించి, పదివేలకు మించని ఓటర్లతో ఉన్న రాజ్య బార్ కౌన్సిలు విషయములో ఇరవై మంది సభ్యులు,

మరియు పదివేలకు మించిన ఓటర్లతో ఉన్న రాజ్య బార్ కౌన్సిలు విషయములో, ఇరవై అయిదుగురు సభ్యులు

అడ్వకేట్లలో నుండి ఏకల అంతరణీయ ఓటు ద్వారా అనుపాతిక ప్రాతినిధ్య పద్ధతి ప్రకారము ఎన్నుకొనబడవలెను:

అయితే, అట్లు ఎన్నికైన సభ్యులలో, సాధ్యమైనంత వరకు, సగం మంది దాదాపు భారత బార్ కౌన్సిలు ఈ విషయమున చేయునట్టి ఏవేని నియమములకు లోబడి, రాజ్యజాబితా (స్టేట్ రోల్)లో కనీసము పది సంవత్సరముల పాటు అడ్వకేట్లుగా ఉన్న వ్యక్తులై ఉండవలెను, మరియు

1926లో 38వ చట్టము. ఎవరేని అట్టి వ్యక్తికి సంబంధించి సదరు పదిసంవత్సరముల కాలావధిని లెక్కించుటలో భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద ఒకవ్యక్తి అడ్వకేటుగా నమోదయిన కాలావధిని చేర్చవలెను.

(3) ప్రతి రాజ్యబార్ కౌన్సిలుకు విహితపరచబడునట్టి రీతిలో కౌన్సిలుచే ఎన్నుకొనబడిన ఛైర్మను మరియు వైస్ ఛైర్మను ఉండవలెను.

1977లో 38వ చట్టము.

(3ఏ) అడ్వకేట్ల (సవరణ) చట్టము, 1977 ప్రారంభమునకు అవ్యవహిత పుర్వము ఏదేని రాజ్య బార్ కౌన్సిలు ఛైర్మను లేక వైస్ ఛైర్మను పదవి కలిగిఉన్న ప్రతివ్యక్తి, అట్టి ప్రారంభము మీదట, ఛైర్మను లేక వైస్-ఛైర్మను సందర్భానుసారము పదవిని విరమించవలెను:

1977లో 38వ చట్టము.

అయితే అడ్వకేట్ల (సవరణ) చట్టము, 1977 ప్రారంభమైన తరువాత ఎన్నుకొనబడిన ప్రతియొక్కరాజ్య బార్ కౌన్సిల్ ఛైర్మను లేక వైస్-ఛైర్మను సందర్భానుసారముగా పదవీ బాధ్యతలు స్వీకరించునంత వరకు, అట్టి ప్రతివ్యక్తి ఆయన పదవికి సంబంధించిన కర్తవ్యములను నిర్వహించుచునే ఉండవలెను.

(4) ఒక అడ్వకేటు, భారత బార్ కౌన్సిలు ఈ విషయమున విహితపరచునట్టి అర్హతలు కలిగిఉండి మరియు అట్టి షరతులను సంతృప్తిపరచిననే తప్ప, ఉప-పరిచ్ఛేదము (2) క్రింద ఎన్నికలో ఓటుచేయుటకు లేక రాజ్య బార్ కౌన్సిలు సభ్యునిగా ఎంపికచేయ బడుటకు మరియు సభ్యునిగా ఉండుటకు నిరర్హుడైఉండును మరియు చేయబడునట్టి ఏవేని నియమములకు లోబడి, ఒక్కొక్క రాజ్య బార్ కౌన్సిలు, ఆయా సమయములందు, ఓటర్ల జాబితాను తయారు చేసి పునరీక్షించవలెను.

1964లో 21వ చట్టము

(5) ఉప-పరిచ్ఛేదము (2)కుగల వినాయింపులోనిదేదియు, అడ్వకేట్ల (సవరణ) చట్టము, 1964 ప్రారంభమునకు పూర్వము ఎన్నుకొనబడిన ఎవరేని సభ్యుని పదవీ కాలముపై ప్రభావము కలిగిఉండదు, అయితే సదరు వినాయింపును అమలుచేయుటకు, అట్టి ప్రారంభము తరువాత ప్రతి ఎన్నిక, భారత బార్ కౌన్సిలు చేసిన నియమములకు సంబంధించిన నిబంధనల ప్రకారము జరగవలెను.

1973లో 60వ చట్టము

(6) ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (బి)లోనిదేదియు, అడ్వకేట్ల (సవరణ) చట్టము, 1973 ప్రారంభమునకు అవ్యవహిత పూర్వము సంఘటితము చేయబడిన ఏదేని రాజ్య బార్ కౌన్సిలు, ఈచట్టపు నిబంధనల ప్రకారము తిరిగి సంఘటితము చేయబడునంత వరకు ఏదేని రాజ్యబార్ కౌన్సిలుకు ఎన్నుకొనబడిన సభ్యుల ప్రాతినిధ్యముపై ప్రభావము కలిగిఉండదు.

భారత బార్ కౌన్సిలు.

4.(1) ఈ చట్టము విస్తరించు క్షేత్రములకు భారత బార్ కౌన్సిలు అని పిలువబడు బార్ కౌన్సిలు ఈ క్రింది సభ్యులతో కూడి ఉండవలెను, వారెవరనగా:

(ఏ) భారత అటార్నీ జనరలు, పదవీ రీత్యా;

(బి) భారత సొలిసిటరు జనరలు, పదవీ రీత్యా;

(బిబి) * * * *

(సి) ఒక్కొక్క రాజ్య బార్ కౌన్సిలు తమసభ్యుల నుండి ఎన్నుకొనిన సభ్యుడొకరు;

(1ఏ) ఏ వ్యక్తిగాని, 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2)కుగల వినాయింపులో నిర్దిష్టపరచిన అర్హతలు కలిగిఉన్ననే తప్ప, భారత బార్ కౌన్సిలు సభ్యునిగా ఎన్నుకొనబడుటకు అర్హతకలిగి ఉండరు.

(2) భారత బార్ కౌన్సిలుకు, విహితపరచబడునట్టి రీతిలో ఎన్నుకొనబడిన ఛైర్మను మరియు వైస్ ఛైర్మను ఉండవలెను.

1977లో 38వ చట్టము.

(2ఏ) అడ్వకేట్ల (సవరణ) చట్టము, 1977 ప్రారంభమగుటకు అవ్యవహిత పూర్వము భారత బార్ కౌన్సిలు ఛైర్మనుగా లేక వైస్ ఛైర్మనుగా పదవి కలిగిఉన్న వ్యక్తి, అట్లు ప్రారంభమైన మీదట, ఛైర్మను లేక వైస్-ఛైర్మను సందర్భానుసారముగ పదవిని విరమించవలెను:

1977లో 38వ చట్టము.

అయితే అడ్వకేట్ల (సవరణ) చట్టము, 1977 ప్రారంభమైన తరువాత కౌన్సిలు ఛైర్మను లేక వైస్ ఛైర్మను సందర్భానుసారముగా ఎన్నుకొనబడి, పదవీ బాధ్యతలను స్వీకరించునంతవరకు, అట్టి వ్యక్తి తన పదవీ బాధ్యతలను నిర్వహించుచునే ఉండవలెను.

(3) రాజ్య బార్ కౌన్సిలుచే ఎన్నుకొనబడిన భారతబార్ కౌన్సిలు సభ్యుని పదవీ కాలము-

(i) పదవీరీత్యా పదవి కలిగి ఉన్న రాజ్య బార్ కౌన్సిలు సభ్యుని విషయములో ఆయన ఎన్నిక తేదీ నుండి రెండు సంవత్సరములు లేక రాజ్య బార్ కౌన్సిలులో అతను సభ్యత్వమును కోల్పోవుట, వీటిలో ఏది ముందు అయితే అంత వరకు; మరియు

(ii) ఏదేని ఇతర విషయములో, రాజ్య బార్ కౌన్సిలు సభ్యునిగా ఆయన పదవినందున్న కాలావధి వరకు

ఉండును:

అయితే అట్టి ప్రతి సభ్యుడు, తన ఉత్తరాధికారి ఎన్నుకొనబడునంత వరకు, భారత బార్ కౌన్సిలు సభ్యునిగా పదవిలో కొనసాగవలెను.

బార్ కౌన్సిలు నిగమ నికాయముగా ఉండుట.

5. ప్రతి బార్ కౌన్సిలు, చరస్థిరాస్తులను ఆర్జించు, మరియు కలిగి ఉండు శాశ్వత ఉత్తరాధికారము సామాన్య మొహరును కలిగిఉండు, కాంట్రాక్టు కుదుర్చుకొను అధికారముతో నిగమనికాయమై ఉండును మరియు అది సదరునామముతో దావాలు వేయవచ్చును మరియు దానిపై దావాలు వేయబడవచ్చును.

రాజ్యబార్ కౌన్సిళ్ల కృత్యములు.

6. (1) రాజ్య బార్ కౌన్సిలు కృత్యములు-

(ఎ) వ్యక్తులను తన జాబితా (రోల్) లో అడ్వకేట్లుగా చేర్చుకొనుట;

(బి) అట్టి జాబితాను తయారు చేసి నిర్వహించుట;

(సి) తన జాబితాలోని అడ్వకేట్లపై చెడునడతకు సంబంధించిన కేసులను స్వీకరించుట మరియు నిర్ణయించుట;

(డి) తన జాబితాలోని అడ్వకేట్ల హక్కులు, విశేషాధికారములు మరియు హితములను సంరక్షించుట;

(డిడి) ఈ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము(2) యొక్క ఖండము (ఎ)లోనూ మరియు 7వ పరిచ్ఛేదము యొక్క ఉప-పరిచ్ఛేదము (2)లోని ఖండము (ఎ)లోనూ నిర్దేశించిన సంక్షేమ పథకములను సమర్థవంతముగా అమలుచేయుట కొరకు బార్ అసోసియేషన్ల అభివృద్ధిని పెంపొందించుట;

(ఇ) న్యాయ సంస్కరణను పెంపొందించుట మరియు దానిని బలపరచుట;

(ఇఇ) న్యాయ విషయములపై ప్రముఖ న్యాయవేత్తలచే చర్చాగోష్ఠులు మరియు ప్రసంగాలు నిర్వహించి, జర్నలు మరియు న్యాయహితము గల పత్రములను ప్రచురించుట;

(ఇఇఇ) పేదలకు విహితరీతిలో న్యాయవాద సహాయమును వ్యవస్థీకరించుట;

(ఎఫ్) బార్ కౌన్సిలు నిధులను నిర్వహించుట మరియు పెట్టుబడిపెట్టుట;

(జి) తన సభ్యుల ఎన్నికకు ఏర్పాటు చేయుట;

(జిజి) 7వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1)లోని ఖండము (i) క్రింద ఇచ్చిన ఆదేశముల ప్రకారము విశ్వ విద్యాలయములను సందర్శించుట మరియు తనిఖీ చేయుట;

(హెచ్) ఈ చట్టముచే లేక చట్టము క్రింద దానికి ఒసగిన అన్ని ఇతర కృత్యములను నిర్వర్తించుట;

(ఐ) పై కృత్యములు నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు చేయుట;

అయిఉండును.

(2) రాజ్య బార్ కౌన్సిలు విహితరీతిలో-

(ఎ) నిరుపేద, అశక్తతగల అడ్వకేట్లకు లేక ఇతర అడ్వకేట్ల కొరకు సంక్షేమ పథకముల నిర్వహణకై ఆర్థిక సహాయము చేయుటకు;

(బి) ఈ విషయమై చేసిన నియమముల ననుసరించి న్యాయవాద సహాయము లేక సలహా ఇచ్చుటకు

(సి) న్యాయ గ్రంథాలయములను స్థాపించుట

ఒకటి లేక అంతకుమించి నిధులను సంఘటితము చేయవచ్చును.

(3) రాజ్య బార్ కౌన్సిలు, ఉప-పరిచ్ఛేదము (2)లో నిర్దిష్టపరచిన అన్ని లేక ఏవేని ప్రయోజనముల కొరకు ఏవేని అనుదానములు, విరాళములు, బహుమతులు లేక

ఉపకృతులను స్వీకరించవచ్చును, మరియు వాటిని ఆ ఉప-పరిచ్ఛేదము క్రింద సంఘటితము చేసిన సముచిత నిధి లేక నిధులకు జమచేయవలెను.

భారత బార్ కౌన్సిలు కృత్యములు.

7. (1) భారత బార్ కౌన్సిలు కృత్యములు-

(ఎ) * * * *

(బి) అడ్వకేట్ల కొరకు వృత్తిపరమైన నడవడిక ప్రమాణములను మరియు శిష్టాచారమును నిర్ధారించుట;

(సి) దాని యొక్క క్రమశిక్షణా కమిటీ మరియు ప్రతిఒక రాజ్య బార్ కౌన్సిలు క్రమశిక్షణా కమిటీ అనుసరించవలసిన ప్రక్రియను నిర్ధారించుట;

(డి) అడ్వకేట్ల హక్కులు, విశేషాధికారములు మరియు హితములు సంరక్షించుట;

(ఇ) న్యాయ సంస్కరణను పెంపొందించుట మరియు దానిని బలపరచుట;

(ఎఫ్) ఈ చట్టము క్రింద ఉత్పన్నమై, రాజ్య బార్ కౌన్సిలుచే దానికి నిర్దేశించబడు ఏదేని విషయమును నిర్వహించుట మరియు దానిని పరిష్కరించుట;

(జి) రాజ్య బార్ కౌన్సిళ్లపై సాధారణ పర్యవేక్షణ మరియు నియంత్రణను వినియోగించుట;

(హెచ్) న్యాయవిద్యను పెంపొందించుట మరియు అట్టి విద్యను బోధించుచున్న భారత దేశములోని విశ్వవిద్యాలయములలోను మరియు రాజ్య బార్ కౌన్సిళ్లలోను సంప్రదించి అట్టి విద్యా ప్రమాణములు నిర్ధారించుట;

(ఐ) అడ్వకేటుగా నమోదగుటకు ఏ విశ్వవిద్యాలయముల న్యాయశాస్త్ర పట్టా (డిగ్రీ) అర్హత కలిగినవో ఆ విశ్వవిద్యాలయములను గుర్తించుట మరియు అందు నిమిత్తము విశ్వవిద్యాలయములను సందర్శించుట మరియు తనిఖీ చేయుట; లేదా రాజ్యబార్ కౌన్సిళ్లచే ఈ విషయములో అది ఇచ్చునట్టి ఆదేశముల ప్రకారము విశ్వవిద్యాలయములను సందర్శింపచేయుట మరియు తనిఖీ చేయించుట;

(ఐఏ) న్యాయ శాస్త్ర విషయములపై ప్రముఖ న్యాయవేత్తలచే చర్చా గోష్ఠులు మరియు ప్రసంగాలు నిర్వహించి, జర్నలు మరియు న్యాయ హితము గల పత్రములను ప్రచురించుట;

(ఐబి) విహితరీతిలో పేదలకు న్యాయవాద సహాయమును వ్యవస్థీకరించుట;

(ఐసి) ఈ చట్టము క్రింద అడ్వకేటుగా చేర్చుకొను నిమిత్తము భారతదేశము వెలుపల పొందిన న్యాయ శాస్త్రములోని విదేశీ అర్హతలను పరస్పర ప్రాతిపదికపై గుర్తించుట;

(జె) బార్ కౌన్సిలు నిధులను నిర్వహించుట మరియు పెట్టుబడిపెట్టుట;

(కె) తన సభ్యుల కొరకు ఎన్నికను ఏర్పాటు చేయుట;

(ఎల్) ఈ చట్టముచే లేక దాని క్రింద ఒసగబడిన అన్ని ఇతర కృత్యములు నిర్వర్తించుట;

(ఎమ్) పై కృత్యములను నిర్వహించుటకు అవసరమైన అన్ని ఇతర పనులు చేయుట;

అయి ఉండును.

(2) భారత బార్ కౌన్సిలు విహితరీతిలో-

(ఎ) నిరుపేద, అశక్తత కలిగిన అడ్వొకేట్లకు లేక ఇతర అడ్వొకేట్లకు సంక్షేమ పథకముల నిర్వహణకై ఆర్థిక సహాయము చేయుటకు;

(బి) ఈ విషయమై చేసిన నియమములననుసరించి న్యాయవాద సహాయము లేక సలహా ఇచ్చుటకు

(సి) న్యాయగ్రంథాలయములను స్థాపించుట

ఒకటి లేక అంతకంటే ఎక్కువ నిధులను సంఘటితము చేయవచ్చును.

(3) భారత బార్ కౌన్సిలు, ఉప-పరిచ్ఛేదము (2)లో నిర్దిష్టపరచిన అన్ని లేక ఏవేని ప్రయోజనములకు ఏవేని అనుదానములు, విరాళములు, బహుమతులు లేక ఉపకృతులను స్వీకరించవచ్చును. మరియు వాటిని ఆ ఉప-పరిచ్ఛేదము క్రింద సంఘటితము చేసిన సముచితమైన నిధి లేక నిధులకు జమ చేయవలెను.

అంతర్జాతీయ నికాయములలో సభ్యత్వము.

7ఎ. భారత బార్ కౌన్సిలు, అంతర్జాతీయ బార్ అసోసియేషను లేక అంతర్జాతీయ న్యాయవాద సహాయ సంఘము (అసోసియేషను) సభ్యులు కావచ్చును, చందాగాగాని ఇతర విధముగాగాని తాను యుక్తమని తలచునట్టి మొత్తములను అట్టి నికాయములకు ఈయ వచ్చును మరియు అంతర్జాతీయ న్యాయసమ్మేళనము లేక చర్చాగోష్ఠిలలో తన ప్రతినిధులు పాల్గొనినందుకైన ఏదేని వ్యయమునకు ప్రాధికామీయవచ్చును.

రాజ్యబార్ కౌన్సిలు సభ్యుల పదవీ కాలావధి.

8. రాజ్య బార్ కౌన్సిలుకు ఎన్నుకొనబడిన (54వ పరిచ్ఛేదములో నిర్దేశించబడిన దానికి ఎన్నుకొనబడిన సభ్యుడు కానట్టి) సభ్యుని పదవీ కాలము, అతని ఎన్నిక ఫలితము ప్రచురించబడిన తేదీనుండి అయిదు సంవత్సరముల వరకు ఉండును.

అయితే, రాజ్య బార్ కౌన్సిలు సదరు కాలావధి ముగియు లోపల తన సభ్యుల ఎన్నికకు ఏర్పాటు చేయుటలో విఫలమైన యెడల భారత బార్ కౌన్సిలు వ్రాతమూలకముగా రికార్డుచేయు కారణములపై ఉత్తర్వు ద్వారా సదరు కాలావధిని ఆరునెలలకు మించకుండా పొడిగించవచ్చును.

ఎన్నికలేనప్పుడు ప్రత్యేక కమిటీని సంఘటితము చేయుట.

8-ఏ. (1) రాజ్యబార్ కౌన్సిలు 8వ పరిచ్ఛేదములో నిర్దేశించిన ఐదు సంవత్సరములల కాలావధి లేదా పొడిగించిన కాలావధి ముగియుటకు ముందు తన సభ్యుల కొరకు ఎన్నికలను నిర్వహించుటకు విఫలమైన యెడల భారత బార్ కౌన్సిలు అట్లు ముగిసిన దినమునకు తరువాతి దినమున మరియు ఆ తేదీ నుండి ఈక్రింది వారితో కూడిన ప్రత్యేక కమిటీని సంఘటితము చేయవలెను,-

(i) 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) యొక్క ఖండము (ఎ)లో పేర్కొనిన రాజ్య బార్ కౌన్సిలు యొక్క పదవీ రీత్యా సభ్యుడు:

అయితే ఒకరి కంటే పదవీ రీత్యా సభ్యులు ఎక్కువ ఉన్నట్ల యితే వారిలో అత్యంత సీనియర్ సభ్యుడు ఛైర్మన్ గా వుండవలెను మరియు

(ii) ఈ చట్టము క్రింద బార్ కౌన్సిలు సంఘటితము అయ్యేంతవరకు రాజ్య బార్ కౌన్సిలు కృత్యములను నిర్వర్తించుటకు రాజ్యబార్ కౌన్సిలు ఓటర్ల జాబితాలోని అడ్వకేట్లలోనుండి భారత బార్ కౌన్సిలుచే నామనిర్దేశము చేయబడు సభ్యులు ఇద్దరు.

(2) ప్రత్యేక కమిటీ సంఘటితము చేయబడిన తరువాత మరియు రాజ్య బార్ కౌన్సిలు సంఘటితము అయ్యేంతవరకు,-

(ఎ) రాజ్య బార్ కౌన్సిల్ లో నిహితమైన అన్ని ఆస్తులు మరియు సంపత్తులు ప్రత్యేక కమిటీ యందు నిహితమగును.

(బి) ఏదేని కాంట్రాక్టు వలనగాని లేక ఇతర విధముగాగాని రాజ్య బార్ కౌన్సిల్లో ఏర్పడు అన్ని హక్కులు, దాయిత్వములు మరియు బాధ్యతలు ప్రత్యేక కమిటీ యొక్క హక్కులు, దాయిత్వములు మరియు బాధ్యతలై వుండును.

(సి) ఏదేని క్రమశిక్షణా విషయములోను లేక ఇతర విధముగానూ రాజ్య బార్ కౌన్సిలు ముందు పెండింగులో వున్న అన్ని చర్యలు ప్రత్యేక కమిటీకి బదిలీ చేయబడును

(3) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద సంఘటితమైన ప్రత్యేక కమిటీ భారత బార్ కౌన్సిలు ఈవిషయములో ఇచ్చునట్టి ఆదేశములననుసరించి ఉప-పరిచ్ఛేదము (1) క్రింద అది సంఘటితమైన తేదీనుండి ఆరునెలల కాలావధి లోపల రాజ్యబార్ కౌన్సిల్ కు ఎన్నికలను నిర్వహించవలెను మరియు ఏదేని కారణము వలన సదరు ఆరు నెలల కాలావధి లోపల ఎన్నికను నిర్వహించలేని పరిస్థితిలో ఉన్నప్పుడు వ్రాతమూలకంగా రికార్డుచేయు కారణములపై సదరు కాలావధిని పొడిగించ వచ్చును.

క్రమశిక్షణా కమిటీలు.

9.(1) బార్ కౌన్సిలు, ఒకటి లేక అంతకంటే ఎక్కువ క్రమశిక్షణా కమిటీలను సంఘటితము చేయవలెను. ప్రతి కమిటీ ముగ్గురు వ్యక్తులతో కూడి వుండవలెను. వారిలో కౌన్సిలు తన సభ్యుల నుండి ఎన్నుకొనిన వ్యక్తులు ఇద్దరు, మరియు 3వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2)కు గల వినాయింపులో నిర్దిష్టపరచిన అర్హతలు గల అడ్వకేట్లలో నుండి కౌన్సిలు కోఆప్టు చేసికొనిన మరియు కౌన్సిలు సభ్యుడు కానట్టి వ్యక్తి ఒకరు అయి ఉండవలెను. క్రమశిక్షణా కమిటీలో ఎక్కువ సీనియరు అయిన సభ్యుడు దాని ఛైర్మనుగా ఉండవలెను.

1964లో 21 చట్టము.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికిని, అడ్వకేట్ల (సవరణ) చట్టము, 1964 ప్రారంభమగుటకు పూర్వము సంఘటితము చేయబడిన ఏదేని క్రమ శిక్షణాకమిటీ, దానివద్ద పెండింగులో ఉన్న ప్రొసీడింగులను, ఈ పరిచ్ఛేదము ఆ చట్టముచే సవరించబడ-నట్లుగా పరిష్కరించవలెను.

న్యాయవాద సహాయకమిటీల సంఘటితము.

9ఏ.(1) బార్ కౌన్సిలు, తొమ్మిది మందికి మించని, అయితే అయిదుగురికి తక్కువకాని సభ్యులతో కూడిన ఒకటి లేక అంతకంటే ఎక్కువ న్యాయవాద సహాయ కమిటీలను, విహితపరచబడునట్లు సంఘటితము చేయవచ్చును.

(2) న్యాయవాద సహాయ కమిటీ సభ్యుల అర్హతలు, ఎంపికపద్ధతి మరియు పదవీ కాలావధి విహితపరచబడునట్టివిగా ఉండును.

క్రమశిక్షణా కమిటీలు కానట్టి కమిటీల సంఘటితము.

10.(1) రాజ్య బార్ కౌన్సిలు, ఈక్రింది స్థాయీ కమిటీలను సంఘటితము చేయవలెను, అవేవనగా:-

(ఎ) కౌన్సిలు తమ సభ్యుల నుండి ఎన్నుకొనిన అయిదుగురి సభ్యులతో కూడిన కార్య నిర్వహణ కమిటీ;

(బి) కౌన్సిలు తమ సభ్యుల నుండి ఎన్నుకొనిన ముగ్గురు సభ్యులతో కూడిన పేరు నమోదుచేయు కమిటీ (ఎన్ రోల్ మెంటు) కమిటీ.

(2) భారత బార్ కౌన్సిలు, ఈ క్రింది స్థాయీ కమిటీలను సంఘటితము చేయవలెను, అవేవనగా:-

(ఎ) కౌన్సిలు తనసభ్యుల నుండి ఎన్నుకొనిన తొమ్మిదిమంది సభ్యులతో కూడిన కార్య నిర్వహణ కమిటీ;

(బి) పదిమంది సభ్యులతో కూడిన న్యాయ విద్యా కమిటీ; వీరిలో అయిదుగురు కౌన్సిలు తన సభ్యుల నుండి ఎన్నుకొనిన వ్యక్తులై వుండవలెను మరియు మిగతా అయిదుగురు తన సభ్యులు కానట్టి వారి నుండి కోఆప్ట్ చేసుకొన్న వారై ఉండవలెను.

(3) ఈ చట్టపు నిబంధనలను అమలుపరచు నిమిత్తము రాజ్య బార్ కౌన్సిలు మరియు భారత బార్ కౌన్సిలు తమ సభ్యులలో నుండి అవసరమని భావించునట్టి ఇతర కమిటీలు సంఘటితము చేయవచ్చును.

బార్ కౌన్సిళ్ల మరియు వాటి కమిటీలకార్యకలా-పములను జరుపుట.

10 ఏ. (1) భారత బార్ కౌన్సిలు క్రొత్త ఢిల్లీలో సమావేశము కావలెను. లేదా ఏదేని అట్టి ఇతర స్థలములో వ్రాతమూలకంగా రికార్డు చేయునట్టి కారణములపై నిర్ధారించవలెను.

(2) రాజ్యబార్ కౌన్సిల్ దానిప్రధాన కార్యస్థానములో సమావేశము కావలెను. లేదా ఏదేని అట్టి ఇతర స్థలములో వ్రాతమూలకంగా రికార్డు చేయునట్టి కారణములపై నిర్ధారించవలెను.

(3) క్రమశిక్షణా కమిటీలు తప్ప బార్ కౌన్సిళ్లచే కొనసాగుతున్న ఇతర కమిటీలు తమ బార్ కౌన్సిళ్ల ప్రధాన కార్య స్థానములో సమావేశము కావలెను.

(4) క్రమశిక్షణా కమిటీలు తప్ప ప్రతి బార్ కౌన్సిలు మరియు దాని ప్రతి కమిటీ, విహితపరచబడునట్టివిధముగా తన సమావేశమందు కార్యకలాపములను జరుపు ప్రక్రియకు సంబంధించినట్టి నియమములను పాటించవలెను.

(5) 9వ పరిచ్ఛేదము క్రింద సంఘటితము చేయబడిన క్రమశిక్షణా కమిటీలు, విహితపరచబడు సమయములలోను మరియు స్థలములలోను సమావేశము కావలెను మరియు వాటి సమావేశములలో కార్యకలాపములను జరుపు ప్రక్రియకు సంబంధించిన నియమములను పాటించవలెను.

బార్ కౌన్సిలు సభ్యుల నిరర్హత.

10 బీ. బార్ కౌన్సిలుకు ఎన్నుకొనబడిన సభ్యుడు తాను సభ్యుడుగా ఉన్న బార్ కౌన్సిలు యొక్క మూడు వరుస సమావేశములకు తగిన కారణము లేకుండ గైరుహాజరైనట్లు అట్టి కౌన్సిలు ప్రఖ్యానించి నట్లయితే లేక ఏదేని కారణము నిమిత్తము, అడ్వకేట్ల జాబితా (రోల్) నుండి ఆయన పేరు తొలగించబడినట్లయితే లేక భారతబార్ కౌన్సిలు చేసిన ఏదేని నియమము క్రింద ఆయన ఇతర విధముగా నిరర్హుడైనట్లయితే, తన పదవిని ఖాళీ అయిట్లుగా భావించవలెను.

బార్ కౌన్సిలు సిబ్బంది.

11.(1) ప్రతి బార్ కౌన్సిలు ఒక కార్యదర్శిని, మరియు అది అవసరమని భావించునట్టి ఒక అకౌంటెంటును మరియు అట్టి సంఖ్యలో ఇతర వ్యక్తులను తన సిబ్బందిగా నియమించుకొన వలెను.

(2) కార్యదర్శి మరియు అకౌంటెంటు, ఎవరైన ఉన్నచో, వారు విహితపరచ బడునట్టి అర్హతలు కలిగి ఉండవలెను.

లెక్కలు మరియు ఆడిటు.

12.(1) ప్రతి బార్ కౌన్సిలు, విహితపరచబడునట్టి ప్రరూపములోను మరియు అట్టి రీతిలోను అట్టి లెక్కల పుస్తకములను మరియు ఇతర పుస్తకములను నిర్వహింప చేయవలెను.

1956లో 1వ చట్టము.

(2) బార్ కౌన్సిలు లెక్కలు, విహితపరచబడునట్టి సమయములలోను మరియు అట్టి రీతిలోను, కంపెనీల చట్టము, 1956 క్రింద కంపెనీల ఆడిటర్లుగా వ్యవహరించుటకు అర్హతగలిగిన ఆడిటర్లచే ఆడిటు చేయబడవలెను.

(3) ప్రతి ఆర్థిక సంవత్సరం ఆఖరున సాధ్యమైనంత త్వరలో, అయితే వెనువెంటనే వచ్చు సంవత్సర డిసెంబరు [illegible]వ తేదీ తరువాత కాకుండ, రాజ్యబార్ కౌన్సిలు తన లెక్కల ప్రతిని ఆడిటర్ల నివేదిక ప్రతితో కలిపి భారత బార్ కౌన్సిలుకు పంపవలెను మరియు దానిని అధికార గెజటులో ప్రచురింపజేయ వలెను.

(4) ప్రతి ఒక ఆర్థిక సంవత్సరం ఆఖరులో సాధ్యమైనంత త్వరలో, అయితే వెనువెంటనే వచ్చు సంవత్సర డిసెంబరు 31వ తేదీ తరువాత కాకుండ, భారత బార్ కౌన్సిలు తన లెక్కల ప్రతిని ఆడిటర్ల నివేదిక యొక్క ప్రతితో కలిపి కేంద్రప్రభుత్వమునకు పంపవలెను మరియు దానిని భారత గెజెటులో ప్రచురింప జేయవలెను.

బార్ కౌన్సిలు, వాటి కమిటీలలో ఖాళీల విషయమై తీసికొనిన చర్య చెల్లనివిగా చేయకుండుట.

13. బార్ కౌన్సిలు లేక దానియొక్క ఏదేని కమిటీగాని తీసుకొనిన ఏచర్యలనైనను కౌన్సిలు లేక సందర్భానుసారముగా, కమిటిలో ఏదేని ఖాళీగాని దాని సంఘటితములో ఏదైన లోపముగాని ఉన్నదనుకారణముపై మాత్రమే ప్రశ్నించబడరాదు.

బార్ కౌన్సిళ్ల ఎన్నికను కొన్ని కారణములపై ప్రశ్నించకుండుట.

14. బార్ కౌన్సిలుకు ఒక సభ్యుని యొక్క ఎన్నిక విషయమైగాని నోటీసు తేదీని ఆ తేదీకి ముందు ముప్పది దినములకు తక్కువ కాకుండా అధికార గెజెటులో ప్రచురించబడినట్లయితే, అందు ఓటుచేయుటకు హక్కుగల ఎవరేని వ్యక్తికి తగిన నోటీసు ఈయలేదన్న కారణమున మాత్రము ప్రశ్నించబడరాదు.

నియమములు చేయుటకు అధికారము.

15.(1) బార్ కౌన్సిలు, ఈ అధ్యాయ నిమిత్తము నియమములు చేయవచ్చును.

(2) ప్రత్యేకించియు, మరియు పై అధికారము యొక్క వ్యాపకతకు భంగము లేకుండను, అట్టి నియమములు -

(ఎ) ఏ షరతులకు లోబడి వ్యక్తులు పోస్టలుబ్యాలెటు ద్వారా ఓటు హక్కు వినియోగించవచ్చునో ఆ షరతులతోసహా రహస్యబ్యాలెటు ద్వారా బార్ కౌన్సిలు సభ్యుల ఎన్నిక, ఓటర్ల జాబితాల తయారీ మరియు పునరీక్షణ మరియు ఎన్నిక ఫలితములు ప్రచురించబడవలసిన రీతి;

(బి) * * * *

(సి) బార్ కౌన్సిలు ఛైర్మను మరియు వైస్ ఛైర్మనుల ఎన్నిక యొక్క రీతి;

(డి) బార్ కౌన్సిలు లేక ఛైర్మను లేక వైస్ ఛైర్మను పదవికైన ఎన్నిక మాన్యత విషయమై ఏర్పడిన సందేహములుగాని వివాదములుగాని అంతిమముగా నిర్ణయించబడవలసిన రీతి మరియు ప్రాధికారము;

(ఇ) * * * *

(ఎఫ్) బార్ కౌన్సిలులోని ఆకస్మిక ఖాళీలను భర్తీ చేయుట;

(జి) బార్ కౌన్సిలు ఛైర్మను మరియు వైస్ ఛైర్మన్ల అధికారములు మరియు కర్తవ్యములు;

(జిఎ) 6వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) మరియు 7వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2)లో నిర్దేశించిన ఆర్థిక సహాయము, లేక న్యాయవాద సహాయము లేక సలహానిచ్చు నిమిత్తము బార్ కౌన్సిలు ఒకటిగాని లేక ఎక్కువ నిధులను గాని సంఘటితము చేయుట;

(జిబి) పేదలకు న్యాయవాద సహాయమును మరియు సలహాను, వ్యవస్థీకరించుట, ఆ కార్యం నిమిత్తము కమిటీల మరియు సబ్-కమిటీల సంఘటితము, వాటి కృత్యములు మరియు వాటికి సంబంధించి న్యాయవాద సహాయము లేక సలహా ఇవ్వవచ్చునో ఆ ప్రొసీడింగుల వివరణ;

(హెచ్) బార్ కౌన్సిలును సమనుచేయుట, దానిసమావేశములు జరుపుట, వాటి కార్యకలాప నిర్వహణ మరియు కోరమును సంఘటితము చేయుటకు అవసరమైన సభ్యుల సంఖ్య;

(ఐ) బార్ కౌన్సిలు యొక్క ఏదేని కమిటీ సంఘటితము, దాని కృత్యములు మరియు ఏదేని అట్టి కమిటీ సభ్యుల పదవీ కాలావధి;

(జె) ఏదేని అట్టి కమిటీని సమనుచేయుట, దానిసమావేశములు జరుపుట, దాని కార్యకలాపములు నిర్వహించుట, కోరమును సంఘటితము చేయుటకు అవసరమైన సభ్యుల సంఖ్య;

(కె) బార్ కౌన్సిలు కార్యదర్శి, అకౌంటెంటు మరియు ఇతర ఉద్యోగుల అర్హతలు మరియు సేవా షరతులు;

(ఎల్) బార్ కౌన్సిలు లెక్కలపుస్తకములు మరియు ఇతర పుస్తకముల నిర్వహణ;

(ఎమ్) బార్ కౌన్సిలు ఆడిటర్ల నియామకము మరియు లెక్కల ఆడిటు;

(ఎన్) బార్ కౌన్సిలు నిధుల నిర్వహణ మరియు పెట్టుబడిపెట్టుట గురించి నిబంధన చేయవచ్చును.

(3) రాజ్య బార్ కౌన్సిలుచే ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడిన ఏ నియమము లనుగాని, భారత బార్ కౌన్సిలు ఆమోదించిననే తప్ప, అవి అమలు కలిగిఉండవు.

## అధ్యాయము - III

## అడ్వకేట్లను చేర్చుకొనుట మరియు నమోదుచేయుట

సీనియరు మరియు ఇతర అడ్వకేట్లు.

16. (1) రెండు తరగతుల అడ్వకేట్లు అనగా, సీనియరు అడ్వకేట్లు మరియు ఇతర అడ్వకేట్లుగా వుండవలెను;

(2) ఒక అడ్వకేటుకు బార్ (న్యాయవాదుల సంఘము) లోవున్న స్థాయిని లేక న్యాయశాస్త్రములో ప్రత్యేక పరిజ్ఞానము లేక అనుభవమునుబట్టి అట్టి ఘనతకు అర్హుడని సర్వోన్నత న్యాయస్థానము లేక ఉన్నత న్యాయస్థానము అభిప్రాయపడినపుడు అతని సమ్మతితో, సీనియరు అడ్వకేటుగా నియోగించబడ వచ్చును;

(3) సీనియరు అడ్వకేట్లు, తమ ప్రాక్టీసు విషయములో వారి న్యాయవాద వృత్తిహితము దృష్ట్యా భారత బార్ కౌన్సిలు విహితపరచునట్టి నిర్బంధనలకులోనై వుండవలెను;

(4) నియత తేదీకి అవ్యవహితపూర్వము సర్వోన్నత న్యాయస్థానపు సీనియరుగా వున్న అడ్వకేటును, ఈ పరిచ్ఛేదపు ప్రయోజనముల నిమిత్తము, ఆ న్యాయ స్థానపు సీనియరు అడ్వకేటుగా భావించవలెను:

అయితే తనపేరు నమోదు చేయబడి జాబితా నిర్వహించుచున్న బార్ కౌన్సిలుకు 1965, డిసెంబరు 31వ తేదీకి ముందు తాను సీనియరు అడ్వకేటుగా కొనసాగదలచ లేదని అట్టి ఎవరేని సీనియరు అడ్వకేటు దరఖాస్తు చేసినపుడు, బార్ కౌన్సిలు దరఖాస్తును మంజూరుచేసి తదనుసారముగా జాబితా సవరించవలెను.

రాజ్య బార్ కౌన్సిళ్లు అడ్వకేట్ల జాబితా నిర్వహించుట. 1926లో 38వ చట్టము.

17.(1) ప్రతి రాజ్య బార్ కౌన్సిలు అడ్వకేట్ల పేర్లు, చిరునామాలతో ఈ క్రింది జాబితా తయారుచేయవలెను మరియు నిర్వహించవలెను:-

(ఎ) నియత తేదీకి అవ్యవహిత పుర్వము భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద ఏదేని ఉన్నత న్యాయస్థానపు జాబితా (రోల్)లో అడ్వకేట్లుగా నమోదై, 1947, ఆగస్టు 15వ తేదీకి ముందు భారత పౌరులై ఉండి, భారత ప్రభుత్వ చట్టము, 1935లో నిర్వచించినట్లుగాను మరియు ఎవరైనను ఎప్పుడైనను సదరు తేదీకి ము[illegible] భారతదేశములో కూడియున్న ఏదేని ప్రాంతములో సదరు చట్టము క్రింద అడ్వకేట్లుగా చేర్చుకొనబడిన వ్యక్తులతో కలుపుకొని బార్ కౌన్సిలు అధికారితలో ప్రాక్టీసు చేయుటకు విహితరీతిలో ఉద్దేశము వెలిబుచ్చిన వ్యక్తులందరు;

(బి) నియత తేదీన లేక ఆతేదీ తరువాత ఈచట్టము క్రింద రాజ్య బార్ కౌన్సిలు జాబితాలో అడ్వకేట్లుగా

చేర్చుకొనబడు ఇతర వ్యక్తులందరు.

(2) అట్టి ప్రతి అడ్వకేట్ల జాబితా, సీనియరు అడ్వకేట్ల పేర్లతో మొదటి భాగముగను, ఇతర అడ్వకేట్ల పేర్లతో రెండవ భాగముగను రెండు భాగములుగా కూడి ఉండవలెను.

(3) ఈ పరిచ్ఛేదము క్రింద రాజ్య బార్ కౌన్సిలు తయారుచేసి నిర్వహించు చున్న అడ్వకేట్ల జాబితా యొక్క ప్రతి భాగములోని నమోదులు, సీనియారిటీ క్రమములో ఉండి ఈ విషయమున భారత బార్ కౌన్సిలుచేయు ఏదేని నియమమునకు లోబడి, ఆ సీనియారిటీ, ఈ క్రింది విధముగా నిర్ధయించబడ వలెను:-

(ఎ) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఎ)లో నిర్దేశించబడిన ఒక అడ్వకేటు యొక్క సీనియారిటీ, భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద చేర్చుకొనబడిన/(ఎన్ రోల్ మెంటు) తేదీననుసరించి నిర్ణయించబడవలెను;

1926లో 38వ చట్టము.

(బి) నియత తేదీకి అవ్యవహితపూర్వము సర్వోన్నత న్యాయస్థాన సీనియరు అడ్వకేటుగావున్న ఎవరేని వ్యక్తి యొక్క సీనియారిటీ, రాజ్య జాబితా యొక్క మొదటి భాగపు ప్రయోజనముల నిమిత్తము, భారత బార్ కౌన్సిలు నిర్దిష్టపరచునట్టి సూత్రములననుసరించి నిర్ణయించబడ వలెను;

(సి) * * * *

(డి) నియత తేదీన లేక ఆ తేదీ తరువాత సీనియరు అడ్వకేటుగా చేర్చుకొనబడిన లేక అడ్వకేటుగా నమోదుచేయబడిన ఎవరేని ఇతర వ్యక్తి యొక్క సీనియారిటీ సందర్భమును బట్టి అట్టి చేర్చుకొనబడిన తేదీ లేక నమోదు చేయబడిన ప్రకారము నిర్ధయించబడవలెను;

(ఇ) ఖండము (ఎ)లో ఏమి ఉన్నప్పటికిని అడ్వకేట్ల (సవరణ) చట్టము, 1980 ప్రారంభమునకు ముందుగాని లేక తరువాత గాని అడ్వకేటుగా ప్రవేశించిన అటార్నీ యొక్క సీనియారిటీ, ఆయన అటార్నీగా నమోదు చేయబడిన తేదీననుసరించి నిర్ణయించబడవలెను.

(4) ఏవ్యక్తిగాని, ఒక్కరాజ్య బార్ కౌన్సిలు జాబితాకుమించి అడ్వకేటుగా నమోదు చేసుకొనరాదు.

ఒకరాజ్య జాబితా నుండి మరొక రాజ్య జాబితాకు పేరును బదిలీ చేయుట.

18. (1) 17వ పరిచ్ఛేదములో ఏమిఉన్నప్పటికిని, ఏదేని రాజ్య బార్ కౌన్సిలు జాబితాలో అడ్వకేటుగా పేరు నమోదైన ఎవరేని వ్యక్తి, ఆరాజ్య బార్ కౌన్సిలు జాబితా నుండి తన పేరును ఏదేని ఇతర రాజ్యబార్ కౌన్సిలు జాబితాకు బదిలీచేయుటకు, విహితప్రరూపములో భారత బార్ కౌన్సిలుకు దరఖాస్తు చేసికొనవచ్చును మరియు, అట్టి ఏదేని దరఖాస్తు అందిన మీదట అట్టి వ్యక్తి పేరును ఏవిధమైన రుసుము చెల్లింపు లేకుండ, మొదట పేర్కొనిన రాజ్య బార్ కౌన్సిలు జాబితానుండి తొలగించి, ఇతర రాజ్య బార్ కౌన్సిలు జాబితాలో నమోదు చేయబడవలెనని భారత బార్ కౌన్సిలు ఆదేశించవలెను మరియు సంబంధించిన బార్ కౌన్సిళ్లు అట్టి ఆదేశమును పాటించవలెను:

అయితే, బదిలీ కొరకు దరఖాస్తుచేసుకొన్న వ్యక్తిపై క్రమశిక్షణా చర్య పెండింగులో వున్న కారణంగాను, బదిలీ కొరకైన దరఖాస్తు సద్భావముతో చేయబడలేదనిగాని మరియు మరేదేని ఇతర కారణముపై బదిలీ చేయబడరాదని, భారతబార్ కౌన్సిలు భావించినపుడు, భారత బార్ కౌన్సిలు, ఈ విషయమున దరఖాస్తుదారుకు విన్నపము చేసికొను అవకాశమిచ్చి దరఖాస్తును నిరాకరించవచ్చును.

(2) సందేహముల నివృత్తి కొరకు ఉప-పరిచ్ఛేదము (1)క్రింద ఒక అడ్వకేటు ఒక రాజ్య బార్ కౌన్సిలు జాబితా నుండి తన పేరు మరొకదానికి బదిలీ చేయబడినదని దరఖాస్తు చేసినపుడు, మొదటి జాబితాలో ఆయన ఏ సీనియారిటీకి హక్కు కలిగి ఉన్నారో దానినే తరువాత జాబితాలో కూడా నిలిపివుంచుకొనుటకు యిందుమూలముగా ప్రఖ్యానించడమైనది.

రాజ్య బార్ కౌన్సిళ్లు అడ్వకేట్ల జాబితాల ప్రతులను భారత బార్ కౌన్సిలుకు పంపుట.

19. ప్రతి రాజ్య బార్ కౌన్సిలు ఈ చట్టము క్రింద మొదటిసారిగా తనచే తయారు చేయబడిన అడ్వకేట్ల జాబితా అధిప్రమాణీకృత ప్రతిని భారత బార్ కౌన్సిలుకు పంపవలెను మరియు అట్టిఏవేని జాబితాలో చేసిన మార్పులు మరియు అటు తరువాత దానికి చేసిన చేర్పులన్నింటినీ అవిచేయబడిన వెంటనే భారత బార్ కౌన్సిలుకు తెలియపరచవలెను.

కొంతమంది సర్వోన్నత న్యాయ స్థానపు అడ్వకేట్ల నమోదు (ఎన్ రోల్‌మెంటు) కొరకు ప్రత్యేక నిబంధన.

20. (1) ఈ అధ్యాయములో ఏమి ఉన్నప్పటికిని, నియత తేదీకి అవ్యవహిత పూర్వము సర్వోన్నత న్యాయస్థానములో హక్కు పూర్వకముగా ప్రాక్టీసు చేయుటకు అర్హత కలిగిఉన్న మరియు ఏదేని రాజ్య జాబితాలో పేరు నమోదు చేయబడని ప్రతి అడ్వకేటు, విహితపరచబడిన కాలములో రాజ్య బార్ కౌన్సిలు జాబితాలో తనపేరును నమోదు చేసుకొనుటకు భారత బార్ కౌన్సిలుకు విహితప్రరూపములో, తన ఉద్దేశమును తెలియ జేయవచ్చును. అది అందిన మీదట భారత బార్ కౌన్సిలు అట్టి అడ్వకేటు పేరును,

J-152-6

ఏవిధమైన రుసుము చెల్లింపులేకుండ, ఆ రాజ్య బార్ కౌన్సిలు జాబితాలో నమోదు చేయవలెనని ఆదేశించవలెను. ఆ ఆదేశమును సంబంధిత రాజ్య బార్ కౌన్సిలు పాటించవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1) క్రింద భారత బార్ కౌన్సిలు ఆదేశానుసారము చేసిన ఏదేని నమోదు 17వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3) యొక్క నిబంధనలననుసరించి నిర్ణయించిన సీనియారిటీ క్రమములో ఉండవలెను.

(3) ఉప-పరిచ్ఛేదము (1)లో పేర్కొనబడిన అడ్వకేటు, విహిత కాలములోగా, తన ఉద్దేశము తెలియజేయుటలో లుప్తము లేక వైఫల్యము చెందినపుడు, ఆయన పేరును ఢిల్లీ రాజ్య బార్ కౌన్సిలు జాబితాలో నమోదు చేయబడవలెను.

సీనియారిటీ గురించి వివాదములు.

21. (1) ఇద్దరు లేక ఎక్కువ మంది వ్యక్తుల సీనియారిటీ తేదీ ఒకటే అయినపుడు, వయసులో పెద్దవారిని ఇతరులకంటె సీనియరుగా పరిగణించవలెను.

(2) పైనతెలిపిన దానికిలోబడి, ఎవరేని వ్యక్తి సీనియారిటీ విషయములో ఏదేని వివాదమేర్పడినపుడు, నిర్ణయముకొరకు సంబంధిత రాజ్య బార్ కౌన్సిలుకు దానిని నిర్దేశించవలెను.

ఎన్ రోల్ మెంటు సర్టిఫికేటు.

22.(1) ఈ చట్టము క్రింద రాజ్య బార్ కౌన్సిలు నిర్వహించు అడ్వకేట్ల జాబితాలో పేరు నమోదు చేయబడిన ప్రతి వ్యక్తికి అది విహిత ప్రరూపములో ఎన్ రోల్ మెంటు సర్టిఫికేటును జారీ చేయవలెను.

(2) రాజ్య జాబితాలో ఆవిధముగా పేరు నమోదు చేయబడిన ప్రతివ్యక్తి, తన శాశ్వత నివాసములోని ఏదేని మార్పును, అదిజరిగిన తొంబది దినములలోగా సంబంధించిన బార్ కౌన్సిలుకు తెలియపరచవలెను.

ముందుగా వాదించు హక్కు.

23. (1) భారత అటార్నీజనరలు, ఇతర అడ్వకేట్లందరిపై ముందుగా వాదించు హక్కును కలిగి ఉండును.

(2) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క నిబంధనలకు లోబడి, భారత సొలిసిటరు జనరలు ఇతర అడ్వకేట్లందరిపై ముందుగా వాదించు హక్కు కలిగి ఉండును.

(3) ఉప-పరిచ్ఛేదము (1) మరియు (2)ల యొక్క నిబంధలకు లోబడి, భారత అడిషనల్ సొలిసిటరు జనరలు ఇతర అడ్వకేట్లందరిపై ముందుగా వాదించు హక్కు కలిగి ఉండును.

(3ఏ) ఉప-పరిచ్ఛేదములు (1), (2) మరియు (3) నిబంధనలకు లోబడి, భారత రెండవ అడిషనల్ సొలిసిటరు జనరలు ఇతర అడ్వకేట్లందరి పై ముందుగా వాదించు హక్కు కలిగి ఉండును.

(4) ఉప-పరిచ్ఛేదములు (1), (2), (3) మరియు (3ఏ) నిబంధనలకు లోబడి, ఏదేని రాజ్య అడ్వకేటు జనరలు ఇతర అడ్వకేట్లందరిపై ముందుగా వాదించు హక్కు కలిగి ఉండును మరియు అడ్వకేటు జనరలుల మధ్య ముందుగా వాదించు హక్కు వారి సీనియారిటీని బట్టి నిర్ణయించబడును.

(5) పైన తెలిపిన వాటికి లోబడి;

(i) ఇతర అడ్వకేట్లపై సీనియర్ అడ్వకేట్లు ముందుగా వాదించు హక్కును కలిగి వుందురు, మరియు

(ii) సీనియర్ అడ్వకేట్ల మధ్య, ఇతర అడ్వకేట్ల మధ్య ముందుగా వాదించు హక్కు వారి సీనియారిటీని బట్టి నిర్ణయించబడును.

రాజ్య జాబితాలో ఏ వ్యక్తులు అడ్వకేట్లుగా చేరవచ్చును.

24. (1) ఈ చట్టపు నిబంధనలు, దానిక్రింద చేసిన నియమములకు లోబడి, ఒక వ్యక్తి ఈ క్రింది షరతులు నెరవేర్చినట్లయితే, రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనబడుటకు అతడు అర్హత కలిగి ఉండును, అవేవనగా:-

(ఎ) అతడు భారత పౌరుడై వుండి,

అయితే, ఈ చట్టపు ఇతర నిబంధలకు లోబడి, ఏదేని ఇతరదేశములో తగు అర్హత కలిగిన భారత పౌరులను న్యాయవాద వృత్తిని చేపట్టుటకు అనుమతించినపుడు, ఏదేని ఇతర దేశపు జాతీయుని రాజ్యాజాబితాలో అడ్వకేటుగా అనుమతించవచ్చును.

(బి) అతడు ఇరవై ఒక్క సంవత్సరముల వయస్సును పుర్తి చేసినవాడై;

(సి) అతడు న్యాయశాస్త్ర పట్టభద్రుడై ఉండవలెను-

(i) 1967, మార్చి 12వ తేదీకి పుర్వము భారత రాజ్య క్షేత్రములోని ఏదేని విశ్వవిద్యాలయము నుండి; లేక

(ii) 1947 ఆగస్టు 15వ తేదీకి పూర్వము, భారత ప్రభుత్వ చట్టము; 1935 చే నిర్వచించబడినట్లుగా ఆ తేదీకి ముందు భారత దేశములో ఉన్న ఏదేని ప్రాంతములోని ఏదేని విశ్వవిద్యాలయము నుండి; లేక

(iii) 1967, మార్చి 12వ తేదీ తరువాత, ఉప ఖండము (iii ఎ) లో ఇతర-విధముగా నిబంధించబడిననే తప్ప, భారత బార్ కౌన్సిలుచే ఈ చట్టపు ప్రయోజనములకై గుర్తించబడిన భారతదేశములోని ఏదేని విశ్వ విద్యాలయము నుండి న్యాయశాస్త్రములో మూడు సంవత్సరముల కోర్సు అభ్యసించిన తరువాత; లేక

(iiiఎ) భారత బార్ కౌన్సిలుచే ఈ చట్ట ప్రయోజనముల నిమిత్తము గుర్తించబడిన భారతదేశపు ఏదేని విశ్వవిద్యాలయము నుండి 1967-68 విద్యాసంవత్సరము లేక అంతకంటే పూర్వపు విద్యా సంవత్సరము నుండి ప్రారంభమగు రెండు విద్యాసంవత్సరముల కాలమునకు తక్కువకాని న్యాయశాస్త్ర విద్యాభ్యాసము చేసిన తరువాత; లేక

(iv) మరేదేని ఇతరవిషయములో, భారత బార్ కౌన్సిలుచే ఈ చట్ట ప్రయోజనముల నిమిత్తము భారతరాజ్య క్షేత్రము వెలుపలనున్న ఏదేని విద్యాలయ డిగ్రీని గుర్తించినట్లయితే, ఆ డిగ్రీ; లేక

అతడు బారిస్టరైవుండి మరియు 1976, డిసెంబరు 31వ తేదీన లేక అంతకు పూర్వము బార్ కు పిలువబడి లేక బొంబాయి లేదా కలకత్తా ఉన్నత న్యాయస్థాన అటార్నీగా చేర్చుకొనబడుటకు ఆ ఉన్నత న్యాయ స్థానముచే నిర్ధిష్టపరచిన శిక్షణార్ధి లేక గుమాస్తా పరీక్షలో లేక ఏదేని ఇతర పరీక్షలో ఉత్తీర్ణుడై లేక ఈ చట్టము క్రింద అడ్వకేటుగా చేర్చుకొనబడుటకు న్యాయశాస్త్రములో భారత బార్ కౌన్సిలుచే గుర్తించబడి నట్టి ఇతర విదేశీ అర్హతను పొందినపుడు;

(డి) * * * *

(ఇ) అతడు ఈ అధ్యాయము క్రింద రాజ్య బార్ కౌన్సిలు చేసిన నియమములలో నిర్ధిష్టపరచు ఇతర షరతులు నెరవేర్చినపుడు;

1899లో 2వ చట్టము.

(ఎఫ్) ఎన్ రోల్ మెంటుకు సంబంధించి భారత స్టాంపు చట్టము, 1899 క్రింద విధించదగు స్టాంపు సుంకము దేనినైనను మరియు ప్రవేశ రుసుము ఆరు వందల రూపాయలు రాజ్య బార్ కౌన్సిలుకు, ఒక నూటయాభై రూపాయలు భారత బార్ కౌన్సిలుకు బ్యాంకు డ్రాఫ్టు ద్వారా చెల్లించవలెను.

అయితే అట్టి వ్యక్తి అనుసూచిత కులముల లేక అనుసూచిత జనజాతుల సభ్యుడై ఉండి, విహితపరచిన ప్రాధికారము నుండి ఆ మేరకు ఒక సర్టిఫికేటును దాఖలుచేసినపుడు రాజ్య బార్ కౌన్సిలుకు ఒక వందరూపాయలు మరియు భారత బార్ కౌన్సిలుకు ఇరవై అయిదు రూపాయలు ప్రవేశ రుసుమును చెల్లించవలెను.

విశదీకరణ:- ఈ ఉప-పరిచ్ఛేదము నిమిత్తము, భారత దేశపు విశ్వ విద్యాలయము నుండి న్యాయశాస్త్రములో పట్టభద్రుడై ఆ విశ్వవిద్యాలయము తన నోటీసు బోర్డులో పరీక్ష ఫలితమును ప్రచురించిన లేక ఇతరవిధముగా అతడు ఉత్తీర్ణుడైనట్లు ప్రకటించినపుడు ఒక వ్యక్తి ఆ డిగ్రీని కలిగివున్నట్లు భావించవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమిఉన్నప్పటికిని, న్యాయశాస్త్ర పట్టభద్రుడైన వకీలు లేక ప్లీడరు --

(ఎ) నియత తేదీ నుండి రెండు సంవత్సరముల తరువాత కాకుండా, ఈ చట్ట నిబంధనలననుసరించి రాజ్యజాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనబడుటకు దరఖాస్తు చేసినట్లయితే; మరియు

(బి) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండములు (ఎ), (బి), (ఇ) మరియు (ఎఫ్) లలో నిర్థిష్ట పరచిన షరతులు నెరవేర్చినట్లయితే,

ఆయనను అట్టి ఎన్ రోల్ మెంటుకు అనుమతించవచ్చును.

(3) ఉప-పరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికిని, -

(ఎ) ఒక వ్యక్తి, - ఎవరైతే కనీసము మూడు సంవత్సరముల పాటు, వకీలు లేక ప్లీడరు లేక ముఖ్తార్ గా లేక ఉన్నత న్యాయస్థానపు (ఇదివరకటి భాగము-బీ రాజ్యము యొక్క ఉన్నత న్యాయస్థానముతో సహా) లేక ఏదేని సంఘ రాజ్య క్షేత్రములోని న్యాయిక కమీషనరు న్యాయస్థానములో అడ్వకేటుగా ఏదేని శాసనము క్రింద ఎప్పుడైనను ఎన్ రోల్ మెంటుకు హక్కు కలిగియుండినపుడు; లేక

(ఎఎ) 1961, డిసెంబరు 1వ తేదీకి పుర్వము ఏదేని శాసన నిబంధలరీత్యా న్యాయవాది (వాదము ద్వారాగాని పదవీనిర్వహణ ద్వారాగాని రెండింటి ద్వారాగాని) న్యాయవాద వృత్తిని చేపట్టుటకు అడ్వకేటుగా కాకుండా ఇతర విధముగా హక్కు కలిగి ఉండి లేక సదరు తేదీన ప్రభుత్వ సర్వీసులో లేకుండుట వలన ఆవిధముగా హక్కు కలిగి ఉండు వ్యక్తి ; లేక

(బి) * * * *

(సి) 1937 ఏప్రిలు 1వ తేదీకి పూర్వము, భారత ప్రభుత్వ చట్టము, 1935లో నిర్వచించినట్లుగా బర్మాలో చేరి ఉన్న ఏదేని ప్రాంతములోని ఏదేని ఉన్నత న్యాయ స్థానములో అడ్వకేటుగా వున్నపుడు అయిన ; లేక

(డి) ఈ విషయమున భారత బార్ కౌన్సిలు చేసిన ఏదేని నియమము క్రింద అడ్వకేటుగా ఎన్ రోల్ అగుటకు హక్కు కలిగి ఉన్న

(i) వ్యక్తిని ఈ చట్ట నిబంధనలనుసరించి అట్టి ఎన్ రోల్ మెంటు కొరకు దరఖాస్తు చేసినట్లయితే; మరియు

(ii) ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండములు (ఎ), (బి), (ఇ) మరియు (ఎఫ్) లలో నిర్థిష్టపరచిన షరతులు నెరవేర్చినట్లయితే

రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనవచ్చును.

ఎన్‌రోల్‌మెంటుకు నిరర్హత.

24 ఏ.(1) ఏ వ్యక్తి యైననూ-

(ఎ) నీతి బాహ్యతతో కూడిన అపరాధమునకు దోషస్థాపితుడైనపుడు;

1955లో 22వ చట్టము.

(బి) అస్పృశ్యత (అపరాధములు) చట్టము, 1955 యొక్క నిబంధనల క్రింది అపరాధమునకు దోష స్థాపితుడైనపుడు;

(సి) నీతిబాహ్యతతో కూడుకున్న ఏదేని నేరారోపణపై రాజ్యము క్రింది ఉద్యోగము లేక పదవినుండి అతనిని తొలగించినచో లేక తీసివేయబడినచో;

అతనిని రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనరాదు:

<u>విశదీకరణ:</u> ఈ ఖండములో "రాజ్యము" అను పదబంధము సంవిధానము యొక్క 12వ అనుచ్ఛేదము క్రింద దానికి ఈయబడిన అర్థమునే కలిగియుండును.

అయితే ఆయన విడుదలైనప్పటి నుండి లేదా తీసివేయబడినప్పటి నుండి లేదా సందర్భానుసారము తొలగింపబడినప్పటి నుండి రెండు సంవత్సరముల కాలావధి గడచిన మీదట ఎన్ రోల్ మెంటుకు పైన తెలిపిన నిరర్హతలు అమలు కలిగి ఉండవు.

1958లో 20వ చట్టము.

(2) ఉప-పరిచ్ఛేదము (1) లోనున్నదేదియు, అపరాధుల పరివీక్షణ చట్టము, 1958 నిబంధనల క్రింద నేరము చేసినట్లు కనుగొనిన వ్యక్తికి వర్తించవు.

ఎవరికి ఎన్ రోల్ మెంటు కొరకు దరఖాస్తులు చేయవచ్చును.

25. అడ్వకేటుగా చేర్చుకొనబడు నిమిత్తము, దరఖాస్తుదారు ఎవరి అధికారితా పరిధిలో న్యాయవృత్తి చేయదలచెనో ఆ రాజ్యబార్ కౌన్సిలుకు విహిత ప్రరూపములో దరఖాస్తులు చేయవలెను.

అడ్వకేటుగా చేర్చుకొనబడుటకు దరఖాస్తుల పరిష్కారము.

26.(1) రాజ్య బార్ కౌన్సిలు, అడ్వకేటుగా చేర్చుకొనబడుటకైన ప్రతి దరఖాస్తును తమ ఎన్ రోల్ మెంటు కమిటీకి నిర్దేశించవలెను మరియు ఉప-పరిచ్ఛేదములు (2) మరియు (3) నిబంధనలకు మరియు ఈ విషయమున రాజ్య బార్ కౌన్సిలు వ్రాత పుర్వకముగా ఇచ్చు ఏదేని ఆదేశమునకులోబడి, అట్టి కమిటీ విహిత రీతిలో దరఖాస్తును పరిష్కరించ వలెను.

అయితే, ఈ విషయమున భారత బార్ కౌన్సిలుకు చేయబడిన నిర్దేశముపై లేక ఇతర విధముగా సంగతి ముఖ్యాంశమునకు అసత్య కథనము ద్వారా లేక మోసము ద్వారా లేక అనుచితమైన ఒత్తిడి ద్వారా ఎవరేని వ్యక్తి తన పేరును అడ్వకేట్ల జాబితాలో నమోదు చేసుకొనెనని అది అభిప్రాయపడినపుడు, విన్నపము చేసికొనుటకు అవకాశమిచ్చిన తరువాత అట్టి వ్యక్తి పేరును అడ్వకేట్ల జాబితా నుండి తొలగించవచ్చును.

(2) ఏదేని అట్టి దరఖాస్తును రాజ్య బార్ కౌన్సిలు యొక్క ఎన్ రోల్ మెంటు కమిటీ నిరాకరించదలచినపుడు, అది దరఖాస్తును భారత బార్ కౌన్సిలుకు నిర్దేశించవలెను మరియు అట్టి ప్రతి నిర్దేశము, దరఖాస్తును నిరాకరించుటకు గల కారణముల వివరణ కలిగి ఉండవలెను.

(3) రాజ్య బార్ కౌన్సిలు యొక్క ఎన్ రోల్ మెంటు కమిటీ, భారత బార్ కౌన్సిలుకు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద దానికి నిర్దేశించిన ఏదేని దరఖాస్తును భారత బార్ కౌన్సిల్ అభిప్రాయమునకు అనుగుణముగా పరిష్కరించవలెను.

(4) రాజ్య బార్ కౌన్సిలు యొక్క ఎన్ రోల్ మెంటు కమిటీ తన జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనుటకు గల ఏదేని దరఖాస్తును నిరాకరించినపుడు, అది, వీలైనంత వెంటనే, ఎవరి దరఖాస్తు నిరాకరించబడినదో ఆ వ్యక్తి పేరు, చిరునామా, అర్హతలు మరియు నిరాకరించుటకు గల కారణములను గురించి అన్ని ఇతర బార్ కౌన్సిళ్లకు సూచన పంపవలెను.

జాబితా నుండి పేర్లు తొలగించుటకు అధికారము.

26 ఏ. మరణించిన లేక ఆ మేరకు ఎవరి నుండి అభ్యర్థన అందినదో ఆ అడ్వకేటు పేరును రాజ్యజాబితా నుండి రాజ్య బార్ కౌన్సిలు తొలగించవచ్చును.

కొన్ని పరిస్థితులలో తప్ప, ఒకసారి నిరాకరించబడిన దరఖాస్తును మరొక బార్ కౌన్సిలు స్వీకరించకుండుట.

27. రాజ్య బార్ కౌన్సిలు తన జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనుటకు ఎవరేనివ్యక్తి దరఖాస్తును నిరాకరించినపుడు, దరఖాస్తు నిరాకరించిన రాజ్య బార్ కౌన్సిలు యొక్క మరియు భారత బార్ కౌన్సిలు యొక్క పూర్వానుమతితో తప్ప, ఏ ఇతర రాజ్య బార్ కౌన్సిలు గాని, అట్టి వ్యక్తిని తన జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనుటకు దరఖాస్తును స్వీకరించరాదు.

నియమములు చేయుటకు అధికారము.

28.(1) ఈ అధ్యాయము నిమిత్తము, రాజ్య బార్ కౌన్సిలు నియమములు చేయవచ్చును.

(2) ప్రత్యేకించియు మరియు పైఅధికారము యొక్క వ్యాపకతకు భంగము లేకుండను, అట్టి నియమములు -

(ఎ) 20వ పరిచ్ఛేదము క్రింద రాజ్యబార్ కౌన్సిలు జాబితాలో అడ్వకేటు తన పేరు నమోదు కొరకు ఎంత గడువులో మరియు ఏ ప్రరూపములో తన ఉద్దేశము తెలియజేయవలెను;

(బి) * * * *

(సి) రాజ్య బార్ కౌన్సిలు, తన జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనుటకు దరఖాస్తు చేయవలసిన ప్రరూపము మరియు అట్టి దరఖాస్తును బార్ కౌన్సిలు యొక్క ఎన్ రోల్ మెంటు కమిటీ పరిష్కరించవలసిన రీతి;

(డి) ఒక వ్యక్తిని ఏదేని అట్టి జాబితాలో ఏ షరతులకు లోబడి అడ్వకేటుగా చేర్చుకొనవచ్చును;

(ఇ) ప్రవేశ రుసుము చెల్లించదగిన వాయిదాలు;

(3) ఈ అధ్యాయము క్రింద ఏ నియమములు గాని భారత బార్ కౌన్సిలు ఆమోదించిననే తప్ప, అవి అమలు కలిగి ఉండవు.

## అధ్యాయము IV
## న్యాయవాద వృత్తిని చేయుటకు హక్కు

అడ్వకేట్లు మాత్రమే న్యాయవాద వృత్తికి హక్కు కలిగిన వ్యక్తుల తరగతిగా గుర్తించబడుట.

29. ఈ చట్టపు నిబంధనలకు మరియు దానిక్రింద చేసిన ఏవేని నియమములకు లోబడి, నియత తేదీ నుండి, న్యాయవాద వృత్తిని చేయుటకు హక్కు కలిగిన వ్యక్తుల తరగతి ఒకటి మాత్రమే ఉండవలెను వారెవరనగా, అడ్వకేట్లు.

న్యాయవాద వృత్తి చేయుటకు అడ్వకేట్లకు హక్కు.

30. ఈ చట్టపు నిబంధనలకు లోబడి, రాజ్య జాబితాలో పేరు నమోదు చేయబడిన ప్రతిఅడ్వకేటు, ఈ చట్టము విస్తరించు రాజ్య క్షేత్రమందంతటా హక్కుపూర్వకముగా న్యాయవాద వృత్తిని చేయుటకు అర్హత కలిగి ఉండును, -

(i) సర్వోన్నత న్యాయస్థానముతో సహా అన్ని న్యాయస్థానములు;

(ii) న్యాయసమ్మతముగా సాక్ష్యము తీసుకొను ఏదేని ట్రిబ్యునలు లేక వ్యక్తి ముందు; మరియు

(iii) ఏదేని ప్రాధికారము లేక వ్యక్తి ముందు తత్సమయమున అమలునందున్న ఏదేని శాసనము ద్వారా లేక దానిక్రింద న్యాయవాద వృత్తి చేయుటకు హక్కుగల అట్టి అడ్వకేటు.

అటార్నీలకు ప్రత్యేక నిబంధన.

31. 1976లోని 107వ చట్టము ద్వారా 1-1-1977 నుండి రద్దుచేయబడినది.

ప్రత్యేకించిన కేసులలో హాజరగుటకు అనుమతించుటకు న్యాయస్థానపు అధికారము.

32. ఈ అధ్యాయములో ఏమిఉన్నప్పటికిని ఈ చట్టము క్రింద అడ్వకేటుగా ఎన్‌రోల్‌కాని ఎవరేని వ్యక్తి, ఏదేని ప్రత్యేకించిన కేసులో ఏదేని న్యాయస్థానము, ప్రాధికారి లేక వ్యక్తి దాని ముందుగాని లేదా ఆయన ముందుగాని హాజరగుటకు అనుమతించవచ్చును.

న్యాయవాద వృత్తి చేయుటకు అడ్వకేట్లు మాత్రమే హక్కు కలిగిఉండుట.

33. ఈ చట్టములో లేక తత్సమయమున అమలునందున్న ఏదేని ఇతర శాసనములో ఇతరవిధముగా నిబంధించిననే తప్ప, ఏ వ్యక్తిగాని, ఈచట్టము క్రింద అడ్వకేటుగా పేరు నమోదు అయిననేగాని, నియత తేదీన లేక అటు తరువాత, ఏదేని న్యాయస్థానములో లేక ఎవరేని ప్రాధికారి లేక వ్యక్తి వద్ద న్యాయవాద వృత్తిని చేయుటకు హక్కు కలిగిఉందురు.

ఉన్నత న్యాయ స్థానములకు నియమములు చేయుటకు అధికారం.

34.(1) ఉన్నత న్యాయస్థానములోను మరియు దాని అధీనస్థ న్యాయస్థానములలోను ఏ షరతులకు లోబడి అడ్వకేటు న్యాయవాది వృత్తి చేయవలెనో వివరించుచూ ఉన్నత న్యాయ స్థానము నియమములు చేయవచ్చును.

(1ఏ) ఉన్నత న్యాయస్థానములోగాని, దాని అధీనస్థ ఏదేని న్యాయ స్థానములో గాని ప్రొసీడింగులన్నింటిపై ఎవరేని పక్షకారు యొక్క ప్రతికూల అడ్వకేటును తాను ఖర్చు బాగా చెల్లించవలసిన రుసుము/ఫీజును నియతము చేయుచు మరియు ఖర్చుల విధింపు లేక ఇతర విధముగా క్రమబద్ధము చేయుచూ ఉన్నత న్యాయస్థానము నియమములు చేయవలెను.

(2) ఉప-పరిచ్ఛేదము (1)లోని నిబంధనలకు భంగము వాటిల్లకుండ, కలకత్తా ఉన్నత న్యాయస్థానము,- రాజ్యజాబితాలో అడ్వకేట్లుగా చేర్చుకొనుటకు మరియు వాటికి సంబంధించిన ఏదేని ఇతర విషయమై 58-ఏ.ఓ. పరిచ్ఛేదములో పేర్కొన్న వ్యక్తులు ఉత్తీర్ణులగుటకు శిక్షణార్థులైన గుమాస్తాల కొరకు మధ్యస్థ మరియు అంతిమ పరీక్షలు జరుపు ఏర్పాటుకై నియమములు చేయవచ్చును.

## అధ్యాయము - V
## అడ్వకేట్ల నడవడి

అడ్వకేట్ల చెడునడవడికి శిక్ష.

35.(1) ఫిర్యాదు అందిన మీదట లేక ఇతర విధముగా తన జాబితాలో ఉన్న ఎవరేని అడ్వకేటు వృత్తిపరమైన లేక ఇతర చెడునడవడికి పాల్పడినాడని రాజ్య బార్ కౌన్సిలు విశ్వసించుటకు కారణమున్నపుడు, పరిష్కారము కొరకు, ఆ విషయమును తన క్రమశిక్షణా కమిటీకి నిర్దేశించవలెను.

(1ఏ) రాజ్య బార్ కౌన్సిలు, తనంత తానుగా గాని హితము గల ఎవరేని వ్యక్తి తనకు దరఖాస్తు చేసిన మీదటగాని, క్రమశిక్షణా కమిటీలో పెండింగు ఉన్న ప్రొసీడింగును ఉపసంహరించి ఆ రాజ్య బార్ కౌన్సిలు యొక్క మరేదేని క్రమశిక్షణ కమిటీ పరిశీలించ వలసినదిగా ఆదేశించవచ్చును.

(2) రాజ్యబార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ, విషయము నాకర్ణించుటకు తేదీని నిర్ణయించి మరియు దానికి సంబంధించిన అడ్వకేటుకు మరియు రాజ్య అడ్వకేటు జనరలుకు నోటీసును ఇప్పించవలెను.

(3) రాజ్య బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ సంబంధించిన అడ్వకేటుకు మరియు అడ్వకేటు జనరలుకు విన్నవించుకొను అవకాశమిచ్చిన తరువాత, ఈ క్రింది ఉత్తరువులు వేటినైనను చేయవచ్చును, అవేవనగా:-

(ఏ) ఫిర్యాదును కొట్టి వేయవచ్చును లేక రాజ్య బార్ కౌన్సిలు ప్రేరేపణపై ప్రొసీడింగును ప్రారంభించినపుడు, ప్రొసీడింగును దాఖలు చేయమని ఆదేశించవచ్చును;

(బి) అడ్వకేటును మందలించవచ్చును;

J-152-8

(సి) యుక్తమని తాము భావించునట్టి కాలావధికి అడ్వకేటును న్యాయవాద వృత్తి నుండి సస్పెండుచేయవచ్చును;

(డి) రాజ్య అడ్వకేట్ల జాబితా నుండి అడ్వకేటు పేరును తొలగించ వచ్చును.

(4) ఉప-పరిచ్ఛేదము (3)యొక్క ఖండము (సి)క్రింద న్యాయవాదవృత్తి నుండి అడ్వకేటును సస్పెండు చేసినపుడు అట్టి సస్పెండుచేయబడిన కాలావధిలో ఆయనను భారత దేశములోని ఏదేని న్యాయస్థానములోగాని ఎవరేని ప్రాధికారి లేక వ్యక్తి వద్ద గాని న్యాయవాద వృత్తి చేయుటను కోల్పోవును.

(5) ఉపపరిచ్ఛేదము (2) క్రింద అడ్వకేటు జనరలుకు ఏదేని నోటీసు జారీ చేసినపుడు, అతడు స్వయముగా గాని తన తరఫున హాజరగు ఎవరేని అడ్వకేటు ద్వారా గాని, రాజ్య బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ ముందు హాజరు కావచ్చును.

**విశదీకరణ:-** ఈ పరిచ్ఛేదములో 37వ పరిచ్ఛేదము మరియు 38వ పరిచ్ఛేదము సంఘరాజ్య క్షేత్రమైన ఢిల్లీకి సంబంధించి అడ్వకేటు జనరలు మరియు రాజ్య అడ్వకేటు జనరలు ను పదపరిధిలో అనగా భారత దేశము యొక్క అదనపు సొలిసిటరు జనరలు అని అర్థ...

భారత బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా అధికారములు.

36.(1) ఫిర్యాదు అందిన మీదటగాని ఇతర విధముగా గాని ఏదేని రాజ్య జాబితాలో పేరు నమోదుకానటువంటి అడ్వకేటు ఎవరైనను వృత్తిపరముగా లేక ఇతర చెడునడవడికి పాల్పడినాడని విశ్వసించుటకు భారత బార్ కౌన్సిలుకు కారణమున్న యెడల, పరిష్కారము కొరకు, ఆ విషయమును తాను క్రమశిక్షణా కమిటీకి నిర్దేశించవలెను.

(2) ఈ అధ్యాయములో ఏమిఉన్నప్పటికిని, భారత బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ, తానంతతానుగా గాని లేక ఏదేని రాజ్య బార్ కౌన్సిలు నివేదికపై గాని లేక హితముగల ఎవరేని వ్యక్తి తమకు చేసిన దరఖాస్తుపైగాని, ఏదేని రాజ్య బార్ కౌన్సిలు యొక్క క్రమ శిక్షణ కమిటీ వద్ద పెండింగులో ఉన్న ఎవరేని అడ్వకేటుపై గల క్రమశిక్షణ చర్యలను పరిశీలన కొరకు ఉపసంహరించుకొని, దానిని పరిష్కరించవచ్చును.

(3) భారత బార్ కౌన్సిలు యొక్క క్రమ శిక్షణ కమిటీ, ఈ పరిచ్ఛేదము క్రింద పరిష్కరించు ఏదేని కేసును సాధ్యమైనంత మేరకు, 35వ పరిచ్ఛేదమలో వివరించిన ప్రక్రియను అవలంబించి, ఆ పరిచ్ఛేదములో అడ్వకేటు జనరలు కలిగి వున్న నిర్దేశములను భారత అ...ర్నీ జనరలుకు చేసిన నిర్దేశములుగా అన్వయించు కొనవలెను.

(4) భారత బార్ కౌన్సిలు యొక్క క్రమ శిక్షణ కమిటీ, ఈ పరిచ్ఛేదము క్రింద ఏదేని ప్రొసీడింగులను పరిష్కరించుటలో 35వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (3)క్రింద రాజ్య బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీచేయు ఏదేని ఉత్తరువును చేయవచ్చును,

మరియు భారత బార్‌కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ ముందున్న ఏవేని ప్రొసీడింగులను పరిశీలన నిమిత్తము ఉపసంహరించుకొన్నప్పుడు, సంబంధించిన రాజ్య బార్ కౌన్సిలు ఏదేని అట్టి ఉత్తరువును అమలుపరచవలెను.

క్రమశిక్షణా కమిటీల సంఘటితములో మార్పులు.

36ఏ. 35వ పరిచ్ఛేదము లేక 36వ పరిచ్ఛేదము క్రింద గల ఏవేని ప్రొసీడింగులకు సంబంధించి, రాజ్య బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ గాని, భారత బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీగాని అధికారితను వినియోగించుట మానుకొనినపుడు మరియు మరొక అధికారితగల కమిటీ ఉత్తరాధికారియై, అధికారితను వినియోగించినపుడు, అట్లు ఉత్తరాధికారియగు రాజ్య బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీగాని సందర్భానుసారముగా భారతబార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీగాని తన పూర్వపదవిలో ఉన్న కమిటీ ఏదశలో ప్రొసీడింగులను వదలివేసెనో ఆ దశ నుండి వాటిని కొనసాగించవచ్చును.

క్రమశిక్షణా ప్రొసీడింగుల పరిష్కారము.

36బీ.(1) రాజ్య బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ, తమకు 35వ పరిచ్ఛేదము ద్వారా అందిన ఫిర్యాదును త్వరితముగా పరిష్కరించవలెను మరియు ప్రతి విషయములోను, ఫిర్యాదు అందిన తేదీ నుండి లేక సందర్భానుసారముగ రాజ్య బార్ కౌన్సిలు ప్రేరేపణపై ప్రొసీడింగులు ప్రారంభించిన తేదీ నుండి ఒక సంవత్సరము కాలావధి లోపల వాటిని ముగించవలెను. అట్లు కాని యెడల, ఆ ప్రొసీడింగులు భారత బార్ కౌన్సిలుకు బదిలీ అగును. అపుడు 36వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) క్రింద పరిశీలన నిమిత్తము ప్రొసీడింగులు ఉపసంహరించుకొన్నట్లుగా భారత బార్ కౌన్సిలు దానిని పరిష్కరించ వచ్చును.

1973లో 60వ చట్టము.

(2) ఉపపరిచ్ఛేదము (1)లో ఏమి ఉన్నప్పటికిని, అడ్వొకేట్ల (సవరణ) చట్టము, 1973 ప్రారంభమైన నాటికి, రాజ్యబార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ వద్ద ఒక అడ్వొకేటుపై క్రమశిక్షణా విషయమై ఏవేని ప్రొసీడింగులు పెండింగులో ఉన్నప్పుడు రాజ్య బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ, అట్టి (ప్రారంభపు) తేదీ నుండి ఆరు మాసముల కాలావధి లోగా లేక ఫిర్యాదు అందిన తేదీ నుండి ఒక సంవత్సరపు కాలావధిలోగా లేక, సందర్భానుసారము, రాజ్య బార్ కౌన్సిలు ప్రేరేపణపై ప్రొసీడింగులు ప్రారంభించిన తేదీన, వాటిలో ఏది తరువాత అయితే ఆ తేదీన, వాటిని పరిష్కరించవలెను. అట్లు కానియెడల, అట్టి ప్రొసీడింగులు ఉప-పరిచ్ఛేదము (1) క్రింద పరిష్కారము నిమిత్తము భారత బార్ కౌన్సిలుకు బదిలీ అగును.

భారత బార్ కౌన్సిలుకు అప్పీలు.

37. (1) 35వ పరిచ్ఛేదము క్రింద రాజ్య బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీచే చేయబడిన ఉత్తరువు వలన వ్యధితుడైన ఎవరేని వ్యక్తి, లేక రాజ్య అడ్వకేటు జనరలుచే తనకు ఆ ఉత్తరువు సంసూచించబడిన తేదీ నుండి అరువది దినములలోగా భారత బార్ కౌన్సిలుకు అప్పీలు దాఖలు చేయవచ్చును.

(2) అట్టి ప్రతి అపీలును భారత బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ ఆకర్ణించి, రాజ్య బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ ఇచ్చిన శిక్షను మార్పుచేయు ఉత్తరువుతో సహా దానిపై తాను యుక్తమని భావించునట్టి ఉత్తరువు చేయవచ్చును:

అయితే, రాజ్య బార్ కౌన్సిలు క్రమశిక్షణా కమిటీ యొక్క ఏ ఉత్తరువును గాని, వ్యధితుడైన వ్యక్తికి విన్నవించుకొనుటకు సబబైన అవకాశమీయకుండా ఆయనకు భంగము కలిగినట్లుగా భారత బార్ కౌన్సిల్ యొక్క క్రమశిక్షణా కమిటీ మార్పుచేయరాదు.

సర్వోన్నత న్యాయస్థానమునకు అప్పీలు.

38. 36వ పరిచ్ఛేదము లేక 37వ పరిచ్ఛేదము క్రింద భారతబార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ లేక భారత అటార్నీ జనరలు లేక సందర్భానుసారముగ సంబంధించిన రాజ్య అడ్వకేటు జనరలు, ఉత్తరువు తనకు సంసూచించిన తేదీ నుండి అరువది దినముల లోపల, సర్వోన్నత న్యాయస్థానమునకు అపీలు చేయవచ్చును మరియు సర్వోన్నత న్యాయస్థానము దానిపై తాను యుక్తమని భావించు (భారత బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీచే అధినిర్ణయము చేయబడిన శిక్షను మార్పుచేయు ఉత్తరువుతో సహా) నట్టి ఉత్తరువు చేయవచ్చును:

అయితే, భారత బార్ కౌన్సిలు క్రమశిక్షణా కమిటీ యొక్క ఏ ఉత్తరువును గాని, వ్యధితుడైన వ్యక్తి విన్నవించుకొనుటకు సబబైన అవకాశమునీయకుండ ఆయనకు భంగము కలిగినట్లుగా సర్వోన్నత న్యాయస్థానము మార్పుచేయరాదు.

కాలపరిమితి చట్టము, 1963 యొక్క 5 మరియు 12 పరిచ్ఛేదముల వర్తింపు. 1963లోని 36వ చట్టము.

39. కాలపరిమితి చట్టము, 1963 యొక్క 5 మరియు 12 పరిచ్ఛేదముల నిబంధనలు, సాధ్యమైనంతవరకు, 37వ పరిచ్ఛేదము మరియు 38వ పరిచ్ఛేదము క్రింది అప్పీళ్లకు వర్తించును.

ఉత్తరువును నిలుపుద చేయుట.

40.(1) 37వ పరిచ్ఛేదము లేక 38వ పరిచ్ఛేదము క్రింద చేసిన అపీలు, అప్పీలు చేయబడిన ఉత్తరువు నిలుపును అమలు చేయలేదు. అయితే, భారత బార్ కౌన్సిలు క్రమశిక్షణా కమిటీ గాని సందర్భానుసారము, సర్వోన్నత న్యాయస్థానముగాని, తగిన కారణముపై, తాము యుక్తమని భావించునట్టి నిబంధనలు మరియు షరతులపై, అట్టి ఉత్తరువును నిలుపుదల చేయుమని ఆదేశించ వచ్చును.

(2) 37వ పరిచ్ఛేదము లేక 38వ పరిచ్ఛేదము క్రింద దానినుండి అపీలు చేసి కొనుటకు అనుమతించిన కాలము ముగియుటకు ముందు ఉత్తరువును నిలుపుదల కొరకు దరఖాస్తు చేయబడినపుడు, రాజ్యబార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ లేక సందర్భానుసారముగా, భారతబార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ, తగినంత కారణముపై, తానుయుక్తమని భావించునట్టి నిబంధనలు మరియు షరతులపై, అట్టి ఉత్తరువును నిలుపుదల చేయమని ఆదేశించవచ్చును.

అడ్వకేట్ల జాబితాలో మార్పుచేయుట.

41.(1) ఈ అధ్యాయము క్రింద అడ్వకేటును మందలించుచు లేక సస్పెండు చేయుచు ఉత్తరువు చేయబడినపుడు, -

(ఎ) రాజ్యజాబితాలో పేరునమోదు చేయబడిన అడ్వకేటు విషయములో, ఆ జాబితాలో ఆయన పేరుకు ఎదురుగా శిక్షకు సంబంధించిన రికార్డును నమోదు చేయవలెను.

(బి) * * * *

మరియు న్యాయవాద వృత్తి నుండి అడ్వకేటునుతొలగించుచు ఏదేని ఉత్తరువు చేయబడినపుడు, రాజ్య జాబితాలో ఆయన పేరును కొట్టివేయ వలెను.

(2) * * * *

(3) ఎవరేని అడ్వకేటును న్యాయవాదవృత్తి నుండి సస్పెండు చేసినపుడు లేక తొలగించినపుడు, ఆయన 'ఎన్ రోల్ మెంటు'కు సంబంధించి 22వ పరిచ్ఛేదము క్రింద ఆయనకు ప్రదానము చేసిన సర్టిఫికేటును వాపసు తీసికొనవలెను.

క్రమశిక్షణా కమిటీ యొక్క అధికారములు. 1908లో 5వ చట్టము.

42.(1) బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ ఈక్రింది విషయములకు సంబంధించి, సివిలు ప్రక్రియా స్మృతి, 1908 క్రింద సివిలు న్యాయస్థానములో నిహితమై ఉన్న అధికారములనే కలిగిఉండును, అవేవనగా:-

(ఎ) ఎవరేని వ్యక్తిని సమను చేయుట, ఆయన హాజరగునట్లు చేయుట మరియు ఆయనను ప్రమాణము చేయించి పరీక్షించుట.

(బి) ఏవేని దస్తావేజులను వెల్లడిచేయమని మరియు దాఖలు చేయమని కోరుట;

(సి) అఫిడవిట్లుపై సాక్ష్యము స్వీకరించుట;

(డి) ఏదేని న్యాయస్థానము లేక కార్యాలయము నుండి ఏదేని పబ్లికు రికార్డును లేక దాని ప్రతులను అభ్యర్థించుట;

(ఇ) సాక్షులను లేక దస్తావేజులను పరీక్షించుటకు కమీషనులు జారీచేయుట;

(ఎఫ్) విహితపరచబడు ఏదేని ఇతర విషయము;

J-152-9

అయితే, అట్టి క్రమశిక్షణా కమిటీ ఏది గాని-

(ఎ) ఉన్నత న్యాయ స్థానమునకు అధీనస్థమై ఉన్నట్టి న్యాయస్థానమునకు అధ్యక్షత వహించు ఎవరేని అధికారిని ఉన్నత న్యాయస్థానము యొక్క పూర్వ మంజూరీతో తప్ప;

(బి) రెవిన్యూ న్యాయస్థానము యొక్క ఎవరేని అధికారిని రాజ్యప్రభుత్వ పూర్వ మంజూరుతో తప్ప,

హాజరు కావలసినదని కోరుటకు హక్కు కలిగి ఉండదు.

(2) బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ ముందున్న ప్రొసీడింగులన్నియూ భారత శిక్షా స్మృతి యొక్క 193 మరియు 228వ పరిచ్ఛేదముల అర్థములో న్యాయిక ప్రొసీడింగులుగా భావించవలెను, మరియు అట్టి ప్రతి క్రమశిక్షణా కమిటీని, క్రిమినలు ప్రక్రియా స్మృతి, 1898 యొక్క 480, 482 మరియు 485 పరిచ్ఛేదముల ప్రయోజనముల నిమిత్తము సివిలు న్యాయ స్థానముగా భావించవలెను.

1860లో 45వ చట్టము. 1898లో 5వ చట్టము.

(3) ఉప-పరిచ్ఛేదము (1)ద్వారా ఒసగబడిన ఏవేని అధికారములను వినియోగించు నిమిత్తము, ఒక క్రమశిక్షణా కమిటీ లేక కమీషనుకు అవసరమని వాంఛించు సాక్షిని హాజరుపరచుటకు లేక దస్తావేజును దాఖలు చేయు నిమిత్తము ఏవేని సమనులు లేక ఏదేని ఆదేశికను జారీచేసి ఈ చట్టము విస్తరించు రాజ్య క్షేత్రములలోని ఏదేని సివిలు న్యాయ స్థానమునకు పంపవచ్చును, మరియు సివిలు న్యాయస్థానము అట్టి ఆదేశికను తామీలు చేయించవలెను లేక సందర్భానుసారము, అట్టి కమీషనును జారీచేయించవలెను, మరియు ఏదేని అట్టి ఆదేశిక తన వద్ద హాజరు లేక దాఖలు చేయు నిమిత్తము గల ఆదేశిక అయినట్లుగా దానిని అమలు చేయవచ్చును.

(4) క్రమ శిక్షణ కమిటీ ముందున్న కేసును ఆకర్ణించుటకు నిర్ణయించిన తేదీన దాని ఛైర్మనుగాని లేక ఎవరేని సభ్యుడు గాని హాజరు కానప్పటికిని, అది, తాను యుక్తమని భావించినట్లయితే, అట్లు నియమించిన తేదీన ప్రొసీడింగులు జరపవచ్చును లేక కొనసాగించవచ్చును మరియు ఏవేని అట్టి ప్రొసీడింగులు మరియు క్రమశిక్షణా కమిటీ చేసిన ఏ ఉత్తరువునైననూ, ఏదేని అట్టి తేదీన దాని ఛైర్మను లేక సభ్యుడు హాజరు కాలేదన్న కారణమున మాత్రమే శాసన మాన్యతను కోల్పోయినదైనవిగా ఉండరాదు.

అయితే, 35వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3)లో పేర్కొన్న స్వభావపు ఏ ప్రొసీడింగులలోనైనను అంతిమ ఉత్తరువులు, క్రమశిక్షణా కమిటీ ఛైర్మను మరియు ఇతర సభ్యులు హాజరైననే తప్ప, చేయరాదు.

(5) 35వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (3)లో పేర్కొన్న స్వభావపు ఏ ప్రొసీడింగులలోనైనను క్రమశిక్షణా కమిటీ యొక్క ఛైర్మను మరియు సభ్యులలో అధిక సంఖ్యాకుల అభిప్రాయము లేకపోవుటవలన గాని లేక ఇతరవిధముగా గాని వారి అభిప్రాయము ననుసరించి అంతిమ ఉత్తరువులు చేయుటకు వీలులేనపుడు, వారి అభిప్రాయముతో సంబంధించిన బార్ కౌన్సిలు ఛైర్మను వద్ద లేక బార్ కౌన్సిల్ ఛైర్మను, క్రమశిక్షణా కమిటీ ఛైర్మనుగా గాని లేక సభ్యునిగా గాని వ్యవహరించుచున్నపుడు, బార్ కౌన్సిలు వైస్ ఛైర్మనుకు ముందు ఆ కేసును ఉంచవలెను మరియు బార్ కౌన్సిలు ఛైర్మను లేక సందర్భాను సారముగా, వైస్ ఛైర్మను, తాను యుక్తమని భావించునట్లు ఆకర్ణించిన తరువాత, తన అభిప్రాయమును తెలియజేయవలెను మరియు క్రమశిక్షణా కమిటీ యొక్క అంతిమ ఉత్తరువు అట్టి అభిప్రాయముననుసరించవలెను.

భారత బార్ కౌన్సిలు మరియు ఇతర కమిటీల యొక్క అధికారములు.

42 ఏ. 42వ పరిచ్ఛేదపు నిబంధనలు, బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీకి సంబంధించి వర్తించునట్లుగానే, అవి, భారతబార్ కౌన్సిలు, బార్ కౌన్సిలు యొక్క నమోదు కమిటీ, ఎన్నిక కమిటీ, న్యాయవాద సహాయ కమిటీ, లేక ఏదేని ఇతర కమిటీకి సంబంధించి, సాధ్యమైనంత వరకు, వర్తించును.

క్రమశిక్షణా కమిటీ ముందున్న ప్రొసీడింగుల ఖర్చు.

43. బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ ముందున్న ఏవేని వ్యవహార విషయముల ఖర్చులకు సంబంధించి తానుయుక్తమని భావించునట్టి ఉత్తరువు చేయ వచ్చును మరియు-

(ఎ) భారత బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ ఉత్తరువు విషయములో, సర్వోన్నత న్యాయ స్థానము యొక్క;

(బి) రాజ్య బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ ఉత్తరువు విషయములో, ఉన్నత న్యాయస్థానము యొక్క;

ఉత్తరువు అయినట్లుగా, దానిని అట్టి ఏదేని ఉత్తరువుగా అమలుచేయవలెను.

క్రమశిక్షణా కమిటీచే ఉత్తరువుల పునర్విలోకన.

44. బార్ కౌన్సిలు యొక్క క్రమశిక్షణా కమిటీ తానంత తాను గాని, లేక ఇతర విధముగాగాని, ఈ అధ్యాయము క్రింద తాను ఉత్తరువు చేసిన అరువది దినముల లోపల అట్టి ఏదేని ఉత్తరువును పునర్విలోకన చేయవచ్చును.

అయితే, రాజ్య బార్ కౌన్సిలు క్రమశిక్షణా కమిటీ యొక్క పునర్విలోకనకు సంబంధించినట్టి ఉత్తరువును భారత బార్ కౌన్సిలు ఆమోదించిననే తప్ప, అది అమలుకలిగి ఉండదు.

## అధ్యాయము-6

## వివిధములు

**న్యాయస్థానములు మరియు ఇతర ప్రాధికారుల వద్ద శాసనవిరుద్ధముగా న్యాయవాద వృత్తి చేయు వ్యక్తులకు శాస్తి.**

45. ఏదేని న్యాయస్థానము లేక ఎవరేని ప్రాధికారి లేక వ్యక్తి వద్ద, ఈ చట్ట నిబంధనల క్రింద న్యాయవాద వృత్తి చేయుటకు హక్కు కలిగి ఉండని ఎవరేని వ్యక్తి, న్యాయవాద వృత్తి చేసినచో ఆరు మాసముల దాకా ఉండగల కాలావధికి కారావాసముతో శిక్షించదగి ఉండవలెను.

46. * * * *

**రాజ్య బార్ కౌన్సిలుకు ఆర్థిక సహాయము.**

46ఏ. ఏదేని రాజ్య బార్ కౌన్సిలు ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వర్తించు నిమిత్తము నిధులు అవసరము ఉన్నట్లు భారతబార్ కౌన్సిలు అభిప్రాయ పడినట్లయితే, అనుదానము రూపమునగాని లేక ఇతర విధముగాగాని ఆ బార్ కౌన్సిలుకు, తాను యుక్తమని భావించునట్టి ఆర్థిక సహాయము చేయవచ్చును.

**పరస్పరత్వము.**

47. (1) కేంద్ర ప్రభుత్వము ఈవిషయములో అధికార గెజెటులో అధిసూచన ద్వారా నిర్దిష్టపరచిన ఏదేని దేశము, న్యాయవాద వృత్తిని చేయుటకు భారత పౌరులను నివారించినపుడు లేక ఆ దేశములో అనుచిత విచక్షణకు గురిచేసినపుడు, ఆ దేశపు వారెవరైననూ భారత దేశములో న్యాయవాదవృత్తిని చేయుటకు హక్కు కలిగి ఉండరు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)యొక్క నిబంధనలకు లోబడి, భారత పౌరులు కాని వ్యక్తులు పొందిన న్యాయశాస్త్రములోని విదేశ అర్హతలను ఈ చట్టము క్రింద అడ్వకేటుగా చేర్చుకొనుటకు ఏవైన షరతులకు లోబడి ఉండవలసినట్లయితే, వాటిని భారత బార్ కౌన్సిలు విహితపరచవచ్చును.

**శాసనిక ప్రొసీడింగులకు నష్టపూర్తి.**

48. ఈ చట్టపు నిబంధనలు లేక దాని క్రింద చేసిన ఏవేని నియమములననుసరించి సద్భావముతో చేసిన లేక చేయుటకు ఉద్దేశించిన ఏదేని కార్యమునకై ఏదేని బార్ కౌన్సిలుపై లేక దాని యొక్క ఏదేని కమిటీపై లేక బార్ కౌన్సిలు యొక్క సభ్యునిపై లేక దాని ఏదేని కమిటీపై ఏ దావా లేక ఇతర శాసనిక ప్రొసీడింగు గాని ఉండదు.

**పునరీక్షణ అధికారము.**

48ఏ. (1) రాజ్యబార్ కౌన్సిలు లేక దాని కమిటీచే పరిష్కరించబడి మరియు ఎట్టి అపీలు ఉండని, ఈ చట్టపు క్రింద గల ఏదేని ప్రొసీడింగు యొక్క శాసనిక లేక ఔచిత్యము విషయమై భారతబార్ కౌన్సిలు సంతృప్తిచెందు నిమిత్తము, అది అట్టి పరిష్కారము యొక్క రికార్డును ఎప్పుడైనను తెప్పించు కొనవచ్చును మరియు దానికి సంబంధించి తాను యుక్తమని తలచునట్టి ఉత్తరువులు చేయవచ్చును.

(2) ఎవరేని వ్యక్తికి భంగము కలిగించు ఏ ఉత్తరువునైనను, విన్నవించుకొనుటకు అతనికి సబబైన అవకాశము నీయకుండ, ఈ పరిచ్ఛేదము క్రింద చేయరాదు.

పునర్విలోకనము.

48ఏఏ. భారత బార్ కౌన్సిలు లేక దాని క్రమశిక్షణా కమిటీ కానట్టి దాని ఏవేని కమిటీలు, ఈ చట్టము క్రింద తాను ఉత్తరువు చేసిన అరువది దినములలోగా, తనంత-తానుగాగాని లేక ఇతర విధముగా గాని అట్టి ఏదేని ఉత్తరువు పునర్విలోకన చేయవచ్చును.

ఆదేశములు ఇచ్చుటకు అధికారము.

48 బి.(1) రాజ్య బార్ కౌన్సిలు లేక దాని ఏదేని కమిటీ సక్రమముగాను, సమర్థవంతముగాను కృత్యములు నిర్వర్తించు నిమిత్తము, భారత బార్ కౌన్సిలు, తన సాధారణ పర్యవేక్షణ మరియు నియంత్రణ అధికారములు వినియోగించుటలో తనకు అవసరమని తోచునట్టి ఆదేశములను రాజ్య బార్ కౌన్సిలుకు లేక ఏదేని కమిటీకి ఈయ-వచ్చును, మరియు రాజ్య బార్ కౌన్సిలు లేక కమిటీ అట్టి ఆదేశములను పాటించవలెను.

(2) రాజ్య బార్ కౌన్సిలు ఏ కారణము వలనైనను తన కృత్యములు నిర్వహించ-లేనపుడు, పై అధికార వ్యాపకతకు భంగము లేకుండా, భారత బార్ కౌన్సిలు, తనకు అవసరమని తోచు ఆదేశములను ఆ పదవీరీత్యా సభ్యునికి ఈయవచ్చును. మరియు రాజ్య బార్ కౌన్సిలు చేసిన నియమములలో ఏమి ఉన్నప్పటికిని, అట్టి ఆదేశములు అమలు కలిగి ఉండును.

నియమములను చేయుటకు భారత బార్ కౌన్సిలుకు గల సాధారణ అధికారము.

49.(1) భారత బార్ కౌన్సిలు, ఈ చట్టము క్రింద తన కృత్యములను నిర్వర్తించు నిమిత్తము నియమములు చేయవచ్చును, మరియు, ప్రత్యేకించి, అట్టి నియమములు --

(ఎ) ఓటర్ల అర్హతలు లేక నిరర్హతలతో సహా రాజ్య బార్ కౌన్సిలుకైన ఎన్నికలో, ఏ షరతులకు లోబడి అడ్వకేటు ఓటుహక్కు కలిగిఉండునో, ఆ షరతులు, మరియు ఓటర్లకు సంబంధించిన ఎన్నికల జాబితాను ఏ రీతిలో రాజ్య బార్ కౌన్సిలు తయారుచేయునో మరియు పునరీక్షించునో, వాటిని;

(ఎబి) బార్ కౌన్సిలు సభ్యత్వమునకు అర్హతలు మరియు అట్టి సభ్యత్వమునకు నిరర్హతలు;

(ఎసి) 3వ పరిచ్ఛేదపు ఉపపరిచ్ఛేదము (2)కు గల వినాయింపు ఎంత కాలము లోగా మరియు ఏ రీతిలో అమలు చేయబడవలెనో, వాటిని;

(ఎడి) ఒకటికి మించి రాజ్య జాబితాలో ఎవరేని అడ్వకేటు పేరును నమోదు చేయించడాన్ని నివారించు రీతి;

(ఎఇ) అడ్వకేట్ల మధ్య సీనియారిటీ నిర్ధారణ చేయదగు రీతి;

(ఎఎఫ్) ఏదేని గుర్తింపు గల విశ్వవిద్యాలయములో న్యాయశాస్త్ర డిగ్రీ కోర్సులో ప్రవేశము కొరకు కావలసిన కనీస అర్హతలు;

J-152-10

(ఎజి) అడ్వకేట్లుగా నమోదు అగుటకు హక్కు గల వ్యక్తుల తరగతి లేక వర్గము;

(ఎహెచ్) ఏ షరతులకు లోబడి ఒక అడ్వకేటు న్యాయవాద వృత్తి చేయు హక్కు కలిగిఉండునో, మరియు ఆ పరిస్థితులలో ఆ వ్యక్తి ఒక న్యాయస్థానములో అడ్వకేటుగా న్యాయవాద వృత్తి చేయుచున్నట్లుగా భావించదగును.

(బి) ఒక రాజ్య జాబితా నుండి మరొక రాజ్య జాబితాకు ఒక అడ్వకేటు పేరును బదిలీ చేయుట కొరకు దరఖాస్తు చేసుకొనవలసిన ప్రరూపము;

(సి) అడ్వకేట్లు పాటించవలసిన వృత్తిపరమైన ప్రవర్తనావళి మరియు శిష్టాచార ప్రమాణములు;

(డి) భారత దేశములోని విశ్వవిద్యాలయములు పాటించవలసిన న్యాయ శాస్త్ర విద్యా ప్రమాణములు మరియు అందు నిమిత్తము విశ్వవిద్యాలయముల తనిఖీ;

(ఇ) భారతదేశ పౌరులు కాని వ్యక్తులు పొందిన విదేశీ న్యాయశాస్త్ర అర్హతలు ఈ చట్టము క్రింద అడ్వకేటుగా ప్రవేశము పొందుటకు గుర్తించుట;

(ఎఫ్) రాజ్యబార్ కౌన్సిలు క్రమశిక్షణా కమిటీ ద్వారా మరియు దాని సొంత క్రమశిక్షణా కమిటీ ద్వారా అనుసరించబడవలసిన ప్రక్రియ;

(జి) న్యాయవాద వృత్తి విషయములో సీనియరు అడ్వకేట్లుకు లోబడి ఉండవలసిన నిర్బంధనలు;

(జిజి) వాతావరణ పరిస్థితుల దృష్ట్యా, ఏదేని న్యాయస్థానము లేక ట్రిబ్యునలులో హాజరగు అడ్వకేట్లు ధరించవలసిన దుస్తులు లేక అంగీల (రోబ్‌ల) ప్రరూపము;

(హెచ్) ఈ చట్టము క్రింద ఏదేని విషయమునకు సంబంధించి విధించదగు ఫీజు;

(ఐ) రాజ్య బార్ కౌన్సిళ్ల మార్గదర్శకత్వమునకు సాధారణ సూత్రములు మరియు భారత బార్ కౌన్సిలు జారీచేసిన ఆదేశములు లేక చేసిన ఉత్తరువులను అమలుచేయు రీతి;

(జె) విహితపరచవలసిన ఏదేని ఇతర విషయము,-

అయితే ఖండము (సి) లేక ఖండము (జిజి)కి సంబంధించి చేసిన ఏ నియమములు గాని, భారత ప్రధాన న్యాయమూర్తి ఆమోదము పొందిననే తప్ప, అమలు కలిగివుండవు.

అంతేకాక, ఖండము (ఇ)కి సంబంధించి చేసిన ఏ నియమములుగాని కేంద్ర ప్రభుత్వ ఆమోదము పొందిననే తప్ప, అమలు కలిగి ఉండవు.

(2) ఉప-పరిచ్ఛేదము (1)కి గల మొదటి వినాయింపులో ఏమిఉన్నప్పటికిని, సదరు ఉప-పరిచ్ఛేదము యొక్క ఖండము(సి) లేక ఖండము (జిజి)కి సంబంధించి మరియు అడ్వకేట్ల (సవరణ) చట్టము, 1973 ప్రారంభమగుటకు అవ్యవహిత పూర్వము చేసిన ఏవేని నియమములు, ఈ చట్టపు నిబంధనలననుసరించి మార్పు లేక రద్దు లేక సవరణ చేయబడునంత వరకు అమలులో కొనసాగును.

1973లోని 60వ చట్టము.

నియమములు చేయుటకు కేంద్ర ప్రభుత్వ అధికారము.

49ఏ.(1) కేంద్ర ప్రభుత్వము, అధికార గెజెటులో అధిసూచన ద్వారా,- ఏ విషయమునకు సంబంధించి భారత బార్ కౌన్సిలు లేక రాజ్య బార్ కౌన్సిలు నియమములు చేయుటకు అధికారము కలిగివున్నదో ఆ నియమములతో సహా ఈ చట్ట ప్రయోజనములను నెరవేర్చుటకు నియమములు చేయవచ్చును.

(2) ప్రత్యేకించియు మరియు పై అధికార వ్యాపకతకు భంగము లేకుండ, అట్టి నియమములు-

(ఏ) బార్ కౌన్సిలు సభ్యత్వము కొరకు అర్హతలు మరియు అట్టి సభ్యత్వమునకు నిరర్హతలు;

(బి) భారత బార్ కౌన్సిలు, రాజ్య బార్ కౌన్సిళ్ల పై వినియోగించదగు పర్యవేక్షణ, నియంత్రణ రీతి మరియు భారత బార్ కౌన్సిలు జారీచేసిన ఆదేశములు లేక చేసిన ఉత్తరువులు అమలుచేయు రీతి;

(సి) ఈ చట్టము క్రింద అడ్వకేట్లుగా నమోదు అగుటకు హక్కు గల వ్యక్తుల తరగతి లేక వర్గము;

(డి) 24వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము(1) యొక్క ఖండము (డి) క్రింద విహితపరచిన శిక్షణ కోర్సు పొందుట మరియు పరీక్ష ఉత్తీర్ణత చెందుట నుండి మినహాయించబడదగిన వ్యక్తుల వర్గము;

(ఇ) అడ్వకేట్ల మధ్య సీనియారిటీ నిర్ధారణ చేయదగిన రీతి;

(ఎఫ్) కేసులను ఆకర్ణించుటలో బార్ కౌన్సిలు క్రమశిక్షణా కమిటీ అనుసరించ వలసిన ప్రక్రియ మరియు అప్పీళ్లు ఆకర్ణించుటలో భారత బార్ కౌన్సిలు యొక్క క్రమ శిక్షణ కమిటీ అనుసరించవలసిన ప్రక్రియ;

(జి) విహితపరచదగు ఏదేని ఇతర విషయము

నిబంధించవచ్చును.

(3) భారత దేశమునకంతటికి లేక అన్ని లేక ఏవేని బార్ కౌన్సిళ్లకు ఈ పరిచ్ఛేదము క్రింద చేయదగిన నియమములు;

(4) బార్ కౌన్సిలుచే చేయబడిన నియమపు ఏదేని నిబంధన, ఈ పరిచ్ఛేదము క్రింద కేంద్రప్రభుత్వముచే చేయబడిన నియమపు ఏదేని నిబంధనకు విరుద్ధముగా ఉన్నచో, అపుడు ఈ పరిచ్ఛేదము క్రింది నియమము, బార్ కౌన్సిలు చేసిన నియమమునకు ముందుగాని లేక అటు తరువాతగాని చేయబడినప్పటికినీ, అమలు కలిగి ఉండును మరియు బార్ కౌన్సిల్ చే చేయబడిన నియమము, విరుద్ధముగా ఉన్నంత మేరకు, చెల్లనిదిగా వుండును.

(5) ఈ పరిచ్ఛేదము క్రింద చేయబడిన ప్రతి నియమమును దానిని చేసిన తరువాత సాధ్యమైనంత వెంటనే, పార్లమెంటు అధివేశనములో ఉన్నట్లయితే, దాని ఉభయ సదనముల సమక్షమందును, మొత్తము ముప్పది దినముల కాలావధిపాటు ఉంచబడవలెను. ఈ కాలావధి ఒకే అధివేశనములో గాని, రెండు లేక అంత కంటే ఎక్కువ అనుక్రమ అధివేశనములోగాని చేరి ఉండవచ్చును. పై తెలిపిన అధివేశనము లేక అనుక్రమ అధివేశనములకు అవ్యవహితముగా అనంతరమువచ్చు అధివేశనము ముగియుటకు ముందు నియమములో ఏదేని మార్పు చేయుటకు లేక నియమమును చేయరాదని ఉభయ సదనములు అంగీకరించినట్లయితే, అటుతరువాత నియమము అట్లు మార్పుచేసిన రూపములో మాత్రమే అమలు కలిగిఉండును లేక సందర్భానుసారముగా అమలులోనికి రాదు; అయినప్పటికిని, అట్టి ఏదేని మార్పు లేదా రద్దు ఆ నియమము క్రింద ఇదివరలో చేయబడిన దేని శాసన మాన్యతకైనను భంగము కలిగించదు.

కొన్ని అధిశాసనముల రద్దు.
1926లోని 38వ చట్టము.

50.(1) ఈచట్టము క్రింద రాజ్య బార్ కౌన్సిలు సంఘటితము చేయబడిన తేదీన భారత బార్ కౌన్సిళ్ల చట్టము,1926 యొక్క 3 నుండి 7 పరిచ్ఛేదములను కలుపుకొని, 9వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదములు (1), (2) మరియు (3), 15వ పరిచ్ఛేదము మరియు 20వ పరిచ్ఛేదపు నిబంధనలు, రాజ్య బార్ కౌన్సిలు సంఘటితము చేయబడిన రాజ్య క్షేత్రములలో రద్దగును.

(2) అధ్యాయము 3 అమలులోనికివచ్చు తేదీన, ఈ క్రిందివి రద్దగును, అవేవనగా:-

1879లోని 18వ చట్టము.

(ఎ) న్యాయవాదుల చట్టము, 1879 యొక్క 6, 7, 18, మరియు 37 పరిచ్ఛేదములు, మరియు న్యాయవాదుల ప్రవేశము కొరకు మరియు వారి నమోదుకు సంబంధించినంత వరకు ఆ చట్టము యొక్క 8, 9, 16, 17, 19 మరియు 41 పరిచ్ఛేదములు;

1920లోని 17వ బొంబాయి చట్టము.

(బి) బొంబాయి ప్లీడర్ల చట్టము, 1920 యొక్క 3, 4 మరియు 6 పరిచ్ఛేదములు;

1926లోని 38వ చట్టము. (సి) న్యాయవాదుల ప్రవేశము మరియు వారి నమోదుకు సంబంధించినంత వరకు భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 యొక్క 8వ పరిచ్ఛేదము;

(డి) న్యాయవాదుల ప్రవేశము మరియు వారి నమోదుకు సంబంధించినంత వరకు ఏదేని ఉన్నత న్యాయ స్థానపు లెటర్సు పేటెంటు (అధికార పత్రములు) యొక్క మరియు ఏదేని ఇతర శాసనము యొక్క నిబంధనలు.

(3) అధ్యాయము 4 అమలులోనికి వచ్చు తేదీన, ఈ క్రిందివి రద్దగును, అవేవనగా:-

1879లోని 18వ చట్టము. (ఎ) న్యాయవాదుల చట్టము,1879 యొక్క 4, 5,10 మరియు 20 పరిచ్ఛేదములు, మరియు ఏదేని న్యాయస్థానము లేక ఎవరేని ప్రాధికారి లేక వ్యక్తివద్ద న్యాయవాద వృత్తినిచేయు హక్కును న్యాయవాదులకు ఒసగునంత వరకు ఆ చట్టము యొక్క 8, 9, 19 మరియు 41 పరిచ్ఛేదములు;

1920లోని 17వ బొంబాయి చట్టము. (బి) బొంబాయి ప్లీడర్ల చట్టము, 1920 యొక్క 5, 7, 8 మరియు 9 పరిచ్ఛేదములు;

1926లోని 38వ చట్టము. (సి) భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 యొక్క 14వ పరిచ్ఛేదము మరియు ఏదేని న్యాయ స్థానము లేక ఎవరేని ప్రాధికారి లేక వ్యక్తి వద్ద న్యాయవాద వృత్తిని చేయు హక్కు న్యాయవాదులకు ఒసగునంత మేరకు ఆ చట్టము యొక్క 8 మరియు 15 పరిచ్ఛేదములు;

1951లోని 18వ చట్టము. (డి) సర్వోన్నత న్యాయస్థానపు అడ్వకేట్ల (ఉన్నత న్యాయస్థానములలో న్యాయవాద వృత్తి చేయు) చట్టము, 1951;

(ఇ) ఏదేని న్యాయ స్థానము లేక ఎవరేని ప్రాధికారి లేక వ్యక్తి వద్ద న్యాయవాద వృత్తినిచేయు హక్కును న్యాయవాదులకు ఒసగు ఏదేని ఉన్నత న్యాయ స్థానము యొక్క లెటర్సు పేటెంటు (అధికార పత్రములు) మరియు ఏదేని ఇతర శాసనములోని నిబంధనలు;

(4) అధ్యాయము 5 అమలులోనికి వచ్చు తేదీన, ఈ క్రిందివి రద్దగును, అవేవనగా :-

1879లోని 18వ చట్టము. (ఎ) న్యాయవాదుల చట్టము,1879 యొక్క12 నుండి 15 పరిచ్ఛేదములు (కలుపుకొని), 21 నుండి 24 పరిచ్ఛేదములు (కలుపుకొని) మరియు 39 మరియు 40 పరిచ్ఛేదములు మరియు న్యాయవాదుల సస్పెన్షను, తొలగింపు లేక బర్తరఫుకు సంబంధించినంతవరకు ఆ చట్టములోని 16, 17 మరియు 41 పరిచ్ఛేదములు;

J-152-11

1920లోని 17వ బొంబాయి చట్టము.

(బి) బొంబాయి ప్లీడర్ల చట్టము, 1920 యొక్క 24 నుండి 27 పరిచ్ఛేదములు (కలుపుకొని);

1926లోని 38వ చట్టము.

(సి) భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 యొక్క 10 నుండి 13 పరిచ్ఛేదములు (కలుపుకొని);

(డి) న్యాయవాదుల సస్పెన్షను, తొలగింపు లేక బర్తరఫుకు సంబంధించి-నంతవరకు ఏదేని ఉన్నత న్యాయ స్థానపు లెటర్సు పేటెంటు (అధికార పత్రములు) మరియు ఏదేని ఇతర శాసనములోని నిబంధనలు.

(5) ఈ చట్టమంతయు అమలులోనికి వచ్చునపుడు-

(ఎ) ఈ పరిచ్ఛేదములో పైనతెలిపిన ఏవేని నిబంధనల రీత్యా రద్దుకాని న్యాయవాదుల చట్టము,1879 యొక్క 1, 3 మరియు 36 పరిచ్ఛేదములు మినహా ఈ పరిచ్ఛేదములో పేర్కొన్న చట్టముల యొక్క మిగిలిన నిబంధనలు రద్దగును;

1879లోని 18వ చట్టము.

(బి) అనుసూచిలో నిర్దిష్టపరచిన అధిశాసనము అందులో పేర్కొనిన మేరకు రద్దగును.

నియమము యొక్క అన్వయము.

51. నియమిత తేదీన మరియు అప్పటి నుండి, ఉన్నత న్యాయ స్థానముచే నమోదు చేసిన అడ్వకేటుకు ఏదేని శాసనములో ఏ పదముల ప్రరూపములోనైనను చేసిన నిర్దేశములు ఈ చట్టము క్రింద నమోదయిన అడ్వకేటుకు నిర్దేశములుగా అన్వయించుకొన-వలెను.

వ్యావృత్తి.

52. ఈ చట్టములోని దేదియు,-

(ఎ) ఏ షరతులకు లోబడి సీనియరు అడ్వకేటు ఆ న్యాయస్థానములో న్యాయవాద వృత్తి చేయుటకు హక్కు కలిగి ఉందిరో వివరించుటకు;

(బి) ఆ న్యాయస్థానములో వ్యవహరించుటకు లేక వాదించుటకు హక్కు గల వ్యక్తులను నిర్ధారణ చేయుటకు:

సంబంధించి సంవిధానము యొక్క 145వ అనుచ్ఛేదము క్రింద నియమములు చేయుటకు సర్వోన్నత న్యాయస్థానపు అధికారమును ప్రభావము చేయునదిగా భావించబడరాదు.

## అధ్యాయము-7

## తాత్కాలిక మరియు పరివర్తన కాలిక నిబంధనలు.

మొదటి రాజ్య బార్ కౌన్సిలుకు ఎన్నికలు.

53. ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికిని, ఈ చట్టము క్రింద మొదటిసారిగా సంఘటితము చేయబడిన రాజ్య బార్ కౌన్సిలుకు ఎన్నుకొనబడు సభ్యులు, ఎన్నిక తేదీన హక్కు పూర్వకముగా ఉన్నత న్యాయ స్థానములో న్యాయవాద వృత్తి చేయుటకు అర్హత కలిగి మరియు ఏ రాజ్య క్షేత్రమునకు బార్ కౌన్సిలు సంఘటితము చేయబడినదో ఆ రాజ్యక్షేత్రములో సాధారణముగా న్యాయవాద వృత్తి చేయుచున్న అడ్వకేట్లు, వకీళ్లు, ప్లీడర్లు మరియు అటార్నీలచే మరియు వారిలో నుండి ఎన్నుకొనబడవలెను.

**విశదీకరణ:-** ఏ రాజ్య క్షేత్రమునకు బార్ కౌన్సిలు సంఘటితము చేయబడుచున్నదో ఆ రాజ్య క్షేత్రములో సంఘ రాజ్య క్షేత్రము చేరి యున్నపుడు, "ఉన్నత న్యాయస్థానము" అను పదబంధములో ఆ సంఘ రాజ్య క్షేత్ర న్యాయిక కమీషనరు యొక్క న్యాయ స్థానము చేరి ఉండును.

మొదటి రాజ్య బార్ కౌన్సిలు సభ్యుల పదవీ కాలము.

54. ఈ చట్టములో ఏమిఉన్నప్పటికిని, మొదటిసారిగా సంఘటితము చేయబడిన రాజ్య బార్ కౌన్సిలుకు ఎన్నుకొనబడిన సభ్యుల పదవీకాలము, కౌన్సిలు మొదటి సమావేశపు తేదీ నుండి రెండు సంవత్సరములై ఉండును.

అయితే, ఈ చట్టపు నిబంధనల ప్రకారం రాజ్య బార్ కౌన్సిలు తిరిగి సంఘటితము చేయబడనంతవరకు, అట్టి సభ్యులు పదవిలో కొనసాగవలెను.

ప్రస్తుతమున్న కొందరు న్యాయ వాదుల హక్కులు ప్రభావితము కాకుండుట.

55. ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికిని,-

1879లోని 18వ చట్టము. 1920లోని 17వ బొంబాయి చట్టము.

(ఎ) ఈ చట్టము క్రింద అడ్వకేటుగా నమోదగుటకు ఎన్నుకొనని లేక అర్హతను కలిగి ఉండని వారు న్యాయవాదుల చట్టము,1879, బొంబాయి ప్లీడర్ల చట్టము, 1920 లేక ఏదేని ఇతర శాసనపు నిబంధనల రీత్యా అధ్యాయము IV అమలు లోనికివచ్చు తేదీకి అవ్యవహిత పూర్వము (ఇందు ఇటు పిమ్మట ఈ పరిచ్ఛేదములో సదరు తేదీ అని పేర్కొనబడు) న్యాయవాద వృత్తి చేయుచున్నట్టి ప్రతి ప్లీడరు లేక వకీలు;

(బి) * * * * *

1879లోని 18వ చట్టము.

(సి) ఈ చట్టము క్రింద అడ్వకేటుగా నమోదు అగుటకు ఎన్నుకొనని లేక అర్హత కలిగి ఉండని వారు న్యాయవాదుల చట్టము,1879 లేక ఏదేని ఇతర శాసనపు నిబంధనల రీత్యా సదరు తేదీకి అవ్యవహిత పూర్వము న్యాయవాద వృత్తి చేయు చున్నట్టి ప్రతి ముఖ్తారు;

1879లోని 18వ చట్టము.

(డి) న్యాయవాదుల చట్టము, 1879 లేక ఏదేని ఇతర శాసనపు నిబంధనల రీత్యా సదరు తేదీకి అవ్యవహిత పూర్వము న్యాయవాద వృత్తి చేయుచున్నట్టి ప్రతి రెవెన్యూ ఏజెంటు,

1879లోని 18వ చట్టము. 1920లోని 17వ బొంబాయి చట్టము.

న్యాయవాదుల చట్టము, 1879, బొంబాయి ప్లీడర్ల చట్టము, 1920 లేక ఇతర శాసనము యొక్క సంబంధిత నిబంధనలు రద్దు చేయబడినప్పటికిని, న్యాయవాద వృత్తికి సంబంధించి సదరు తేదీకి అవ్యవహిత పూర్వము ఏదేని న్యాయస్థానము లేక రెవెన్యూ కార్యాలయము లేక ఎవరేని ప్రాధికారి లేక వ్యక్తి వద్ద అతడు అనుభవించిన అవే హక్కులను అనుభవించుచునే ఉండవలెను లేక సందర్భానుసారము, అతని అధీనంలో ఉన్న అదే ప్రాధికారి యొక్క క్రమశిక్షణాధికారితకు లోబడి ఉండును మరియు తదనుసారముగా పై తెలిపిన చట్టముల లేక శాసనము రద్దు చేయబడనట్లుగా అట్టి వ్యక్తులకు సంబంధించి అవి అమలు కలిగి ఉండును.

ప్రస్తుతమున్న బార్ కౌన్సిళ్ల విఘటన.

56.(1) ఢిల్లీ బార్‌కౌన్సిలు (ఇందు ఇటు పిమ్మట క్రొత్త బార్‌కౌన్సిలు అని పేర్కొనబడు) కాకుండ, ఈ చట్టము క్రింద రాజ్య బార్ కౌన్సిలు సంఘటితము చేయబడినపుడు -

(ఎ) తదనురూపమైన బార్ కౌన్సిలులో నిహితమైవున్న అన్ని ఆస్తులు మరియు సంపత్తులు క్రొత్త బార్ కౌన్సిలులో నిహితముకావలెను.

(బి) ఏదేని కాంట్రాక్టు నుండి గాని ఇతర విధముగా గాని ఉత్పన్నమైనప్పటికిని, తదనురూపమైన బార్ కౌన్సిలు యొక్క అన్ని హక్కులు, దాయిత్వములు మరియు బాధ్యతలు క్రమముగా క్రొత్త బార్ కౌన్సిల్ యొక్క హక్కులు, దాయిత్వములు మరియు బాధ్యతలుగా ఉండును;

(సి) ఏదేని క్రమశిక్షణ విషయము లేక ఇతర విధమైన దానికి సంబంధించి తదనురూపమైన బార్ కౌన్సిలు ముందు పెండింగులో ఉన్న అన్ని ప్రొసీడింగులు క్రొత్త బార్ కౌన్సిలుకు బదిలీ అగును.

(2) ఈ పరిచ్ఛేదములో, ఢిల్లీ బార్ కౌన్సిలు కానటువంటి ఇతర రాజ్య బార్ కౌన్సిలుకు సంబంధించి "తదనురూపమైన బార్ కౌన్సిలు" అనగా, ఈ చట్టము క్రింద ఏ రాజ్య క్షేత్రములో రాజ్య బార్ కౌన్సిలు సంఘటితము చేయబడినదో ఆ రాజ్య క్షేత్రములోని ఉన్నత న్యాయ స్థానమునకు గల బార్ కౌన్సిలు అని అర్థము.

బార్ కౌన్సిలును సంఘటిత మయ్యేంత వరకు నియమములు చేయుటకు అధికారము.

57. ఈ చట్టము క్రింద బార్ కౌన్సిలు సంఘటితము చేయబడునంత వరకు, ఈ చట్టము క్రింద నియమములు చేయుటకు ఆ బార్ కౌన్సిలు యొక్క అధికారము,-

(ఎ) భారత బార్ కౌన్సిలు విషయములో సర్వోన్నత న్యాయ స్థానముచే;

(బి) రాజ్య బార్ కౌన్సిలు విషయములో ఉన్నత న్యాయ స్థానముచే:

వినియోగించబడవలెను.

పరివర్తన కాలావధులలో ప్రత్యేక నిబంధనలు.

58.(1) ఈ చట్టము క్రింద రాజ్య బార్ కౌన్సిలు సంఘటితము చేయబడనపుడు లేక అట్లు సంఘటితము చేయబడిన రాజ్య బార్ కౌన్సిలు ఒక న్యాయ స్థానము యొక్క ఏదేని ఉత్తరువు వలనగాని ఇతర విధముగాగాని తన కృత్యములు నిర్వర్తించలేనపుడు, ఆ రాజ్య బార్ కౌన్సిలు లేక ఏదేని దాని కమిటీ యొక్క కృత్యములు, అడ్వకేట్లు ప్రవేశము కొరకు మరియు వారి నమోదుకు సంబంధించినంత మేరకు, ఈ చట్టపు నిబంధనలననుసరించి అవి ఉన్నత న్యాయ స్థానముచే నిర్వర్తించబడ వలెను.

(2) అధ్యాయము IV అమలులోనికి వచ్చునంత వరకు, 28వ పరిచ్ఛేదము క్రింద నియమములు చేయబడనప్పటికినీ లేక అట్లుచేసిన నియమములను భారత బార్ కౌన్సిలు ఆమోదము పొందనప్పటికినీ, ఈ చట్టము క్రింద అడ్వకేటుగా నమోదగుటకు ఎవరేని వ్యక్తి అర్హత కలిగిఉన్నపుడు రాజ్య బార్ కౌన్సిలు లేక రాజ్య బార్ కౌన్సిలు కృత్యములు నిర్వహించు ఉన్నత న్యాయస్థానము, రాజ్య జాబితాలో ఆయనను నమోదు చేసికొనవచ్చును, అట్లు నమోదయిన ప్రతి వ్యక్తి, ఆ అధ్యాయము అమలులోనికి వచ్చునంత వరకు, భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 యొక్క 14వ పరిచ్ఛేదము క్రింద న్యాయవాద వృత్తి చేయుటకు అడ్వ కేటుకు ఒసగిన అన్ని అధికారములకు హక్కు కలిగి ఉండును.

1926లోని 38వ చట్టము.

(3) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికిని, 1961డిసెంబరు 1వ తేదీకి అవ్యవహిత పూర్వము భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద ఏదేని ఉన్నత న్యాయస్థానపు జాబితాలో అడ్వకేటై లేక ఈ చట్టము క్రింద అడ్వకేటుగా నమోదయిన ప్రతి వ్యక్తి అధ్యాయము IV అమలులోనికి వచ్చువరకు, ఈ విషయమున సర్వోన్నత న్యాయస్థానము చేసిన నియమములకు లోబడి, హక్కు పూర్వకముగా సర్వోన్నత న్యాయస్థానములో న్యాయవాద వృత్తి చేయుటకు అర్హత కలిగి ఉండును.

1926లోని 38వ చట్టము.

1879లోని 18వ చట్టము. 1920లోని 17వ బొంబాయి చట్టము.

(4) న్యాయవాదుల చట్టము, 1879 నిబంధనల యొక్క 50వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) ద్వారా లేక బొంబాయి ప్లీడర్ల చట్టము, 1920 లేక న్యాయవాదుల ప్రవేశమునకు మరియు వారి నమోదుకు సంబంధించిన ఏదేని ఇతర శాసనము రద్దు చేయబడినప్పటికినీ, పై తెలిపిన చట్టముల మరియు శాసనములోని నిబంధనలు, దాని క్రింద చేసిన ఏవేని నియమములు, న్యాయవాద వృత్తి చేయుటకు ప్రాధికారమిచ్చుచు ఆయనకు సర్టిఫికేటు నవీకరణ లేక నవీకరణ రూపములో జారీ చేయుటకు సంబంధించి అధ్యాయము IV అమలులోనికి వచ్చునంతవరకు, అవి ప్రభావము కలిగి ఉండును. తదనుసారముగ, 1961, డిసెంబరు 1వ తేదీతో ప్రారంభమై, అధ్యాయము IV అమలులోనికి వచ్చు తేదీతో అంతమగు కాలావధిలో పై తెలిపిన చట్టముల క్రింద గాని, ఇతర శాసన నిబంధనల క్రిందగాని జారీచేయబడిన లేక నవీకరించబడిన లేక జారీ చేయబడునట్లు లేక

J-152-12

నవీకరించబడునట్లు తాత్పర్యీతమగు న్యాయవాదికి (ఈ చట్టము క్రింద అడ్వకేటుగా నమోదు చేయబడని) జారీచేయబడిన లేక నవీకరించబడిన ప్రతి సర్టిఫికేటు శాసన మాన్యముగా జారీ చేయబడినట్లు లేక నవీకరించబడినట్లుగ భావించబడవలెను.

కొందరు అడ్వకేట్లకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు.

58ఏ.(1) ఈ చట్టములో ఏమిఉన్నప్పటికిని, 1948, జూలై 26వ తేదీకి అవ్యవహిత పూర్వము అలహాబాదులోని ఉన్నత న్యాయస్థానములో లేక ఔధ్ లోని ప్రధాన న్యాయ స్థానములో న్యాయవాద వృత్తి చేయుటకు హక్కు గల మరియు యునైటెడ్ ప్రావిన్సెస్ ఉన్నత న్యాయస్థానముల (విలీనము) ఉత్తర్వు, 1948 నిబంధనల క్రింద అలహాబాదులోని క్రొత్త హైకోర్టు ఆఫ్ జ్యుడికేచర్ (ఉన్నత న్యాయస్థానము)లో అడ్వకేట్లుగా న్యాయవాదవృత్తి చేయుటకు హక్కు కలిగినట్లు గుర్తించబడి, అయితే ఆ ఉన్నత న్యాయస్థానపు బార్ కౌన్సిలుకు చెల్లించవలసిన ఫీజు చెల్లించక పోవుట వలన మాత్రమే సదరు ఉన్నత న్యాయ స్థానపు అడ్వకేట్ల జాబితాలో లాంఛనప్రాయముగా పేర్లు నమోదు చేయబడని అందరు అడ్వకేట్లు మరియు అట్లు సదరు తేదీకి మరియు 1952, మే, 26వ తేదీకు మధ్య నమోదయిన అడ్వకేట్లందరు 17వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఎ) ప్రయోజనముల నిమిత్తము భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద ఆ ఉన్నత న్యాయస్థాన జాబితాలో అడ్వకేట్లుగా నమోదు అయిన వ్యక్తులుగా భావించబడ వలెను, మరియు అట్టి ప్రతి వ్యక్తి ఈ విషయమున చేసికొన్న దరఖాస్తుపై, ఉత్తర ప్రదేశ్ రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనబడవచ్చును.

1926లోని 38వ చట్టము.

(2) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికినీ, 1952 అక్టోబరు 10వ తేదీకి అవ్యవహిత పూర్వము హైదరాబాదు ఉన్నత న్యాయ స్థానములో న్యాయవాద వృత్తి చేయుటకు హక్కు కలిగి ఉండి, అయితే ఆ ఉన్నత న్యాయ స్థానపు బార్ కౌన్సిలుకు చెల్లించవలసిన ఫీజును చెల్లించకపోవడం మూలంగానే సదరు ఉన్నత న్యాయ స్థానపు అడ్వకేట్ల జాబితాలో లాంఛన ప్రాయంగా పేర్లు నమోదు చేయ బడని అడ్వకేట్లు అందరు, 17వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఎ) ప్రయోజనముల నిమిత్తము, భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద అడ్వకేట్లుగా నమోదైనట్టి వ్యక్తులుగా భావించబడవలెను మరియు అట్టి ప్రతి వ్యక్తి, ఈ విషయమున చేసిన దరఖాస్తుపై, [illegible]దేశ్ లేక మహారాష్ట్ర రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనబడ వచ్చును.

1926లోని 38వ చట్టము.

(3) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికినీ, 1960 మే 1వ తేదీకి అవ్యవహిత పూర్వము బొంబాయి ఉన్నత న్యాయ స్థానములో న్యాయవాద వృత్తి చేయుటకు హక్కు కలిగి మరియు భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 యొక్క 8వ పరిచ్ఛేదము క్రింద గుజరాత్ ఉన్నత న్యాయస్థానపు అడ్వకేట్ల జాబితాలో పేర్లు నమోదు చేయబడుటకు

1926లోని 38వ చట్టము.

దరఖాస్తు చేసికొని, అయితే సదరు నిబంధనలు రద్దు అయినందువలన, అట్లు తమ పేర్లు నమోదు చేయబడని అడ్వకేట్లు అందరు 17వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఎ) ప్రయోజనముల నిమిత్తము, సదరు చట్టము క్రింద గుజరాత్ ఉన్నత న్యాయస్థాన జాబితాలో అడ్వకేట్లుగా నమోదు చేయబడినట్లు భావించబడవలెను మరియు అట్టి ప్రతి వ్యక్తిని, ఈ విషయమై చేసిన దరఖాస్తుపై, గుజరాత్ రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనబడవచ్చును.

(4) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికినీ, 1961, డిశెంబరు 1వ తేదీకి అవ్యవహిత పూర్వము ఏదేని సంఘ రాజ్య క్షేత్రమందు అమలునందున్న ఏదేని శాసనము క్రింద ఆ రాజ్య క్షేత్రములోని న్యాయిక కమీషనరు యొక్క న్యాయస్థానపు జాబితాలో అడ్వకేట్లుగా వున్న వ్యక్తులు అందరు, 17వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఎ) ప్రయోజనముల నిమిత్తము, భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద ఉన్నత న్యాయ స్థానపు జాబితాలో అడ్వకేట్లుగా నమోదు చేయబడిన వ్యక్తులుగా భావించబడవలెను మరియు అట్టి ప్రతి వ్యక్తి, ఈ విషయమై చేసిన దరఖాస్తుపై, ఆ సంఘ రాజ్య క్షేత్రమునకు సంబంధించి నిర్వహించబడుచున్న రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనబడవచ్చును.

1926లోని 38వ చట్టము.

పాండిచ్చేరి సంఘ రాజ్య క్షేత్రమునకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు.

58ఏఏ.(1) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికినీ, అధ్యాయము - III యొక్క నిబంధనలు పాండిచ్చేరి సంఘ రాజ్య క్షేత్రములో అమలులోనికి తేబడిన తేదీకి అవ్యవహిత పూర్వము, సదరు సంఘ రాజ్య క్షేత్రములో అమలునందున్న ఏదేని శాసనము క్రింద న్యాయవాద (వాదన లేక వ్యవహరణ రూపములోగాని రెండింటి రూపములోగాని) వృత్తి చేయుటకు హక్కు గల లేక సదరు తేదీన పబ్లికు సర్వీసులో లేనపుడు అట్లు హక్కు కలిగి ఉండెడు అందరు వ్యక్తులను, 17వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఎ) ప్రయోజనముల నిమిత్తము, భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద ఉన్నత న్యాయ స్థానపు జాబితాలో అడ్వకేట్లుగా నమోదు చేయబడిన వ్యక్తులుగా భావించవలెను మరియు అట్టి ప్రతి వ్యక్తిని, మద్రాసు బార్ కౌన్సిలుచే నిర్దిష్టపరచబడునట్టి కాలములోగా ఈ విషయమై, చేసిన దరఖాస్తుపై, సదరు సంఘ రాజ్య క్షేత్రమునకు సంబంధించి నిర్వహించబడుచున్న రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనబడవలెను.

1926లోని 38వ చట్టము.

(2) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికినీ, అధ్యాయము IV యొక్క నిబంధనలు పాండిచేరి సంఘ రాజ్య క్షేత్రములో అమలులోకి వచ్చిన తేదీకి అవ్యవహిత పూర్వము ఉప-పరిచ్ఛేదము (1) క్రింద అడ్వకేటుగా నమోదును ఎన్నుకోకుండా లేక అర్హత లేకుండా సదరు సంఘ రాజ్య క్షేత్రములో అమలునందున్న ఏదేని శాసనపు నిబంధనల రీత్యా

1968లోని 26వ చట్టము.

న్యాయవాద (వాదన లేక వ్యవహరణ గాని రెండింటి రూపము లేక ఏదేని ఇతర విధముగానైనా) న్యాయవాద వృత్తిని చేయు వ్యక్తులు అందరు పాండిచ్చేరి (శాసనముల విస్తరణ) చట్టము, 1968 ద్వారా అట్టి శాసనములోని సంబంధిత నిబంధనలు రద్దు చేయబడినవను విషయముతో నిమిత్తము లేకుండ ఏదేని న్యాయస్థానము లేక రెవిన్యూ కార్యాలయములో లేక ఎవరేని ప్రాధికారి లేక వ్యక్తి వద్ద న్యాయవాద వృత్తికి సంబంధించి అవే హక్కులు అనుభవించుచునే ఉండవలెను మరియు సదరు తేదీకి అవ్యవహిత పూర్వము అతడు అనుభవించుచున్న లేక సందర్భానుసారముగ అతడు లోబడి ఉన్న అదే ప్రాధికారి యొక్క క్రమశిక్షణాధికారితకు లోబడి ఉండును. మరియు తదనుసారము, పైన తెలిపిన శాసనములోని సంబంధిత నిబంధనలు రద్దుకానట్లుగా అట్టి వ్యక్తులకు సంబంధించి ఆ ప్రభావము కలిగి ఉండును.

మైసూరు రాజ్య బార్ కౌన్సిలుచే నమోదుగాబడిన కొందరు వ్యక్తులకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు.

58ఏబీ. ఈ చట్టములో లేక ఏదేని న్యాయస్థానము యొక్క ఏదేని తీర్పు, డిక్రీ లేక ఉత్తరువులో లేక భారత బార్ కౌన్సిలు చేసిన ఏదేని తీర్మానము లేక ఇచ్చిన ఆదేశములో ఏమిఉన్నప్పటికినీ, మైసూరు ఉన్నత న్యాయ స్థానము నుండి ఆయన ప్లీడరుషిప్ సర్టిఫికేటు పొందినాడన్న ఆధారముపై 1963, ఫిబ్రవరి 28వ తేదీతో ప్రారంభమై 1964, మార్చి 31వ తేదీతో ముగియు కాలావధిలో మైసూరు రాజ్య బార్ కౌన్సిలుచే రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనబడిన ప్రతివ్యక్తి, ఇతర విధముగా నిబంధించబడిననే తప్ప, ఆ రాజ్య జాబితాలో శాసనమాన్యత కలిగిన అడ్వకేటుగా చేర్చుకొనబడినట్లు భావించవలెను మరియు తదనుసారము, న్యాయవాద (వాదన లేక వ్యవహరణ లేక రెండింటిని) వృత్తి చేయుటకు హక్కు కలిగి ఉండును:

అయితే, ఎవరేని అట్టి వ్యక్తి ఏదేని ఇతర రాజ్య బార్ కౌన్సిలు జాబితాలో అడ్వకేటుగా నమోదుకాదలచినపుడు ఇతర రాజ్య బార్ కౌన్సిలుచే అతడు నమోదుగాబడిన తేదీ నుండి అతని పేరు మైసూరు రాజ్య బార్ కౌన్సిలు జాబితా నుండి కొట్టివేయబడి-నట్లుగా భావించబడవలెను:

అంతేకాక, అట్టి వ్యక్తి పేరు మైసూరు రాజ్య బార్ కౌన్సిలు యొక్క రాజ్య జాబితాలోగాని ఏదేని ఇతర బార్ కౌన్సిలు రాజ్య జాబితాలోగాని ఉన్నప్పటికినీ, 17వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము(3) యొక్క ఖండము (డి) ప్రయోజనముల నిమిత్తము, అట్టి వ్యక్తి యొక్క సీనియారిటీని, 1964, మే 16న చేరినట్టి తేదీగా లెక్కించుట ద్వారా నిర్ధారణ చేయవలెను.

ఉత్తరప్రదేశ్ రాజ్య బార్ కౌన్సిలుచే నమోదు చేయబడిన కొందరు వ్యక్తులకు సంబంధించిన ప్రత్యేక నిబంధనలు.

58ఏసీ. ఈ చట్టములో లేక ఏదేని న్యాయస్థానము యొక్క తీర్పు, డిక్రీ లేక ఉత్తరువులో ఏమి ఉన్నప్పటికిని, 1962, జనవరి 2వ తేదీన ప్రారంభమై, 1962, మే 25వ తేదీతో ముగియు కాలావధిలో ఉన్నత న్యాయస్థానముచే అడ్వకేటుగా నమోదుగాబడిన మరియు ఉత్తరప్రదేశ్ రాజ్య బార్ కౌన్సిలుచే రాజ్య జాబితాలో దరిమిలా అడ్వకేటుగా నమోదయిన ప్రతివ్యక్తి, ఉన్నత న్యాయ స్థానముచే తాను నమోదుచేయబడిన తేదీ నుండి రాజ్య జాబితాలో శాసనమాన్యత గల అడ్వకేటుగా చేర్చుకొనబడినట్లు భావించబడ వలెను మరియు తదనుసారముగా, న్యాయవాద (వాదన లేక వ్యవహరణ లేక రెండింటిని) వృత్తిని చేయుటకు హక్కు కలిగిఉండును.

భారత దేశమునకు వలసవచ్చు కొందరు వ్యక్తులకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు. (1879లోని 18వ చట్టము.

58ఏడీ. న్యాయవాదుల చట్టము, 1879, లేక న్యాయవాదుల (ఈ పరిచ్ఛేదములో ఇందు ఇటు పిమ్మట అట్టి చట్టము లేక శాసనము అని పేర్కొనబడు) ప్రవేశము మరియు నమోదుకు సంబంధించిన ఏదేని ఇతర శాసనము యొక్క నిబంధనలు, ఈ చట్టము ద్వారా రద్దు చేయబడుటతో నిమిత్తము లేకుండా భారత ప్రభుత్వ చట్టము, 1935లో నిర్వచించబడినట్లుగా, భారతదేశములో చేరి యున్న ఏ ప్రాంతమునుండైనను 1947, ఆగష్టు 15వ తేదీకు ముందు భారతదేశములోని రాజ్య క్షేత్రమునకు వలస వచ్చు, మరియు అట్లు వలస వచ్చుటకు ముందు, దానిలో అమలునందున్న ఏదేని శాసనము క్రింద అట్టి ఏదేని ప్రాంతములో ప్లీడరు, ముఖ్తారు లేక రెవెన్యూ ఏజెంటు అయిన ప్రతివ్యక్తిని,-

(ఎ) అట్టి చట్టము లేక శాసనము క్రింద సముచిత ప్రాధికారికి అందు నిమిత్తము దరఖాస్తు చేసినట్లయితే; మరియు

(బి) భారత పౌరుడైయుండి, పైన తెలిపిన సముచిత ప్రాధికారి ద్వారా ఈ విషయమున ఏవేని షరతులు నిర్దిష్టపరచబడినట్లయితే, వాటిని నెరవేర్చిన యెడల, మరియు అట్టి చట్టము లేక శాసనము యొక్క సంబంధిత నిబంధనల క్రింద ప్లీడరు లేక ముఖ్తారు లేక, సందర్భానుసారముగ రెవిన్యూ ఏజెంటుగా చేర్చుకొన బడవలెను మరియు నమోదు చేయబడవలెను, మరియు ఈ చట్టముచే అట్టి చట్టము లేక శాసనము యొక్క సంబంధిత నిబంధనలు రద్దు చేయబడినవను విషయముతో నిమిత్తము లేకుండ, అట్లు నమోదు చేయబడిన ప్రతి ప్లీడరు, ముఖ్తారు లేక రెవెన్యూ ఏజెంటు, అట్టి చట్టము రద్దు చేయబడనట్లుగా వాటి యొక్క సంబంధిత నిబంధనల క్రింద ఆయన లోబడి ఉండెడు ఏదేని న్యాయ స్థానము లేక రెవిన్యూ కార్యాలయములో లేక ఎవరేని ఇతర ప్రాధికారి లేక వ్యక్తి వద్ద న్యాయవాద వృత్తి విషయములో అవే హక్కులను కలిగి ఉండును మరియు ఆ ప్రాధికారి యొక్క క్రమశిక్షణాధికారితకు లోబడి ఉండును. తదనుసారముగా ఆ నిబంధనలు అట్టి వ్యక్తికి సంబంధించి ప్రభావము కలిగి ఉండును.

J-152-13

గోవా, డామన్ మరియు డయ్యూ సంఘ రాజ్య క్షేత్ర మునకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు.

58 ఏఈ. (1) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికినీ, అధ్యాయము III యొక్క నిబంధనలు గోవా, డామన్ మరియు డయ్యూ, సంఘ రాజ్య క్షేత్రములో అమలు లోనికి వచ్చు తేదీకి అవ్యవహిత పూర్వము, సదరు సంఘ రాజ్య క్షేత్రములో అమలునందున్న ఏదేని శాసనము క్రింద న్యాయవాద (వాదన లేక వ్యవహరణ ద్వారా లేక రెండింటిని) వృత్తిచేయుటకు హక్కుగల లేక సదరు తేదీన వారు పబ్లిక్ సర్వీసులో లేనట్లయితే అట్లు హక్కు కలిగిఉండెడు అందరు వ్యక్తులు, 17వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (ఎ) ప్రయోజనము నిమిత్తము భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద ఉన్నత న్యాయ స్థానపు జాబితాలో అడ్వకేట్లుగా నమోదు చేయబడిన వ్యక్తులుగా భావించబడవలెను, మరియు అట్టి ప్రతి వ్యక్తి, మహారాష్ట్ర బార్ కౌన్సిలుచే నిర్ధిష్టపరచ బడునట్టి కాలములోగా ఈ విషయమున చేసిన దరఖాస్తుపై, సదరు సంఘ రాజ్య క్షేత్రమునకు సంబంధించి నిర్వహించబడుచున్న రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొన బడవలెను.

1926లోని 38వ చట్టము.

అయితే, పైన తెలిపిన దరఖాస్తు తేదీన, భారత పౌరుడు కానట్టి ఏ వ్యక్తికి గాని, ఈ ఉప-పరిచ్ఛేదపు నిబంధనలు వర్తించవు.

(2) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికిని, అధ్యాయము IV యొక్క నిబంధనలు గోవా, డామన్ మరియు డయ్యూ సంఘ రాజ్య క్షేత్రములో అమలులోనికి తేబడిన తేదీకి అవ్యవహిత పూర్వము, సదరు సంఘ రాజ్య క్షేత్రములో అమలునందున్న ఏదేని శాసన నిబంధనల రీత్యా న్యాయవాద (వాదన లేక వ్యవహరణ ద్వారా లేక రెండింటిని లేక ఏదేని ఇతర విధముగా) వృత్తి చేయుచున్న లేక ఉప-పరిచ్ఛేదము (1) క్రింద అడ్వకేటుగా నమోదగుటకు కోరుకొనని లేక అందుకు అర్హుడు కాని ప్రతి వ్యక్తి, అట్టి శాసనము యొక్క సంబంధిత నిబంధనలు ఈ చట్టము ద్వారా రద్దు చేయబడినప్పటికిని, సదరు తేదీకి అవ్యవహిత పూర్వము ఏదేని న్యాయస్థానము లేక రెవిన్యూ కార్యాలయములో లేక ఎవరేని ఇతర ప్రాధికారి లేక వ్యక్తి వద్ద న్యాయవాద వృత్తికి సంబంధించి ఆయన అనుభవించిన అవే హక్కులను అనుభవించుట లేక సందర్భానుసారముగ ఆయన ఆధీనములోనున్న అదే ప్రాధికారపు క్రమశిక్షణాధికారితకు లోబడి ఉండుట కొనసాగించ వలెను మరియు తదనుసారముగ పైతెలిపిన శాసనములోని సంబంధిత నిబంధనలు రద్దు చేయబడనట్లుగా అట్టి వ్యక్తులకు సంబంధించి అవి అమలు కలిగి ఉండును.

(3) ఈ చట్టము లేక దాని యొక్క ఏదేని భాగము గోవా, డామన్ మరియు డయ్యూ సంఘ రాజ్య క్షేత్రములో అమలులోనికి వచ్చిన తేదీన, ఈ చట్టము లేక దాని భాగమునకు అనురూపముగా ఉండి ఆ సంఘ రాజ్య క్షేత్రములో అమలునందున్న శాసనము లేక ఈ చట్టము యొక్క మరియు 50వ పరిచ్ఛేదపు నిబంధనలరీత్యా రద్దు చేయబడని శాసనము లేక దాని యొక్క అట్టి భాగము కూడ రద్దయినట్లగును.

జమ్మూ మరియు కాశ్మీరుకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు.

1926లోని 38వ చట్టము.

58ఏఎఫ్. (1) ఈ చట్టములో ఏమిఉన్నప్పటికినీ, అధ్యాయము 3 యొక్క నిబంధనలు జమ్మూ మరియు కాశ్మీరు రాజ్యములో అమలులోనికి వచ్చిన తేదీకి అవ్యవహిత పూర్వము ఆ రాజ్య ఉన్నత న్యాయ స్థానములో న్యాయవాద వృత్తి చేయుటకు హక్కుగల లేక ఆ తేదీన పబ్లికు సర్వీసులో లేనట్లయితే అట్లు హక్కు కలిగి ఉండెడు అందరు అడ్వకేట్లు, 17వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము(1) యొక్క ఖండము (ఎ) ప్రయోజనము నిమిత్తము, భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద ఉన్నత న్యాయస్థానపు జాబితాలో అడ్వకేట్లుగా నమోదు చేయబడిన వ్యక్తులుగా భావించబడ వలెను, మరియు అట్టి ప్రతి వ్యక్తి, భారత బార్ కౌన్సిలు నిర్థిష్టపరచునట్టి కాలము లోపల ఈ విషయమున చేసిన దరఖాస్తుపై, సదరు రాజ్యమునకు సంబంధించి నిర్వహించబడు-చున్న రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనబడవలెను.

(2) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికిని, అధ్యాయము III జమ్మూ మరియు కాశ్మీరు రాజ్యములో అమలులోనికి తేబడిన తేదీకి అవ్యవహిత పూర్వము, ఆ రాజ్యములో అమలునందున్న ఏదేని శాసనపు నిబంధనల రీత్యా న్యాయవాద (వాదన లేక వ్యవహరణ లేక రెండింటిని) వృత్తిని, అడ్వకేటుగా కాకుండా ఇతర విధముగా హక్కుగల లేక సదరు తేదీన పబ్లికు సర్వీసులో లేనట్లయితే అట్లు హక్కు కలిగి ఉండెడు ప్రతి వ్యక్తి,-

(i) ఈ చట్టపు నిబంధనల ప్రకారము అట్టి నమోదు కొరకు దరఖాస్తు చేసినట్లయితే; మరియు

(ii) 24వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము(1) యొక్క ఖండములు (ఎ), (బి), (ఇ) మరియు (ఎఫ్)లలో నిర్థిష్టపరచిన షరతులు నెరవేర్చినట్లయితే,

సదరు రాజ్యమునకు సంబంధించి నిర్వహించబడుచున్న రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనబడవలెను.

(3) ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికిని, అధ్యాయము IV యొక్క నిబంధనలు జమ్మూ మరియు కాశ్మీరు రాజ్యములో అమలులోనికి తేబడిన తేదీకి అవ్యవహిత పూర్వము ఉప-పరిచ్ఛేదము (1) లేక ఉప-పరిచ్ఛేదము (2) క్రింద అడ్వకేటుగా నమోదగుటకు కోరుకొనని లేక దానికి అర్హత కలిగి ఉండకుండా దానిలో అమలునందున్న ఏదేని శాసన నిబంధన రీత్యా న్యాయవాద (వాదన లేక వ్యవహరణ లేక రెంటిని లేక ఏదేని ఇతర విధముగా) వృత్తి చేయుచున్న ప్రతి వ్యక్తి, అట్టి శాసనము యొక్క సంబంధిత నిబంధనలు ఈ చట్టముచే రద్దు చేయబడినప్పటికిని, సదరు తేదీకి అవ్యవహిత పూర్వము ఏదేని న్యాయ స్థానము లేక రెవిన్యూ కార్యాలయము లేక ఎవరేని ఇతర ప్రాధికారి లేక వ్యక్తి వద్ద న్యాయవాద వృత్తి విషయములో అనుభవించిన అవేహక్కులను అనుభవించుట

గాని, సందర్భానుసారముగ ఆయన, అధీనమందున్న అదే ప్రాధికారి యొక్క క్రమశిక్షణాధికారితకు లోబడి ఉండుట కొనసాగవలెను మరియు తదనుసారముగ పై తెలిపిన నిబంధనలు రద్దు చేయబడనట్లుగా అట్టి వ్యక్తికి సంబంధించి అమలు కలిగిఉండును.

(4) ఈ చట్టము లేక దాని యొక్క ఏదేని భాగము జమ్మూ మరియు కాశ్మీరు రాజ్యములో అమలులోనికి వచ్చిన తేదీన, ఈ చట్టము లేక దాని భాగమునకు అనురూపముగా ఉండి ఆ రాజ్యములో అమలునందున్న శాసనము లేక ఈ చట్టము యొక్క 50వ పరిచ్ఛేదపు నిబంధనల రీత్యా రద్దు చేయబడని ఈ చట్టము లేక దాని యొక్క భాగము కూడ రద్దయినట్లగును.

శిక్షణార్థులైన గుమాస్తాలకు సంబంధించి ప్రత్యేక నిబంధనలు. 1976లోని 107వ చట్టము.

58ఏజీ. ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికిని, 1976, డిసెంబరు 31వ తేదీకి అవ్యవహితపూర్వము, అడ్వకేట్ల (సవరణ) చట్టము, 1976చే 34వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2) వదలివేయబడుటకు ముందు, ఆ ఉప-పరిచ్ఛేదము క్రింద చేసిన నియమములననుసరించి కలకత్తా ఉన్నత న్యాయ స్థానములో అటార్నీగా నమోదు నిమిత్తము, శిక్షణార్థిత్వమును ప్రారంభించి, ప్రాథమిక పరీక్షలో ఉత్తీర్ణుడైన ప్రతి వ్యక్తి,-

(i)(ఎ) 1976, డిసెంబరు, 31వ తేదీకి పూర్వము, మధ్యస్థ పరీక్షలో ఉత్తీర్ణుడైన పక్షములో అంతిమ పరీక్ష,

(బి) ఏదేని ఇతరవిషయములో మధ్యస్థ మరియు అంతిమ పరీక్ష,

1980, డిసెంబరు 31వ తేదీన లేక అంతకు ముందు ఉత్తీర్ణుడైనట్లయితే,

అతనిని రాజ్య జాబితాలో అడ్వకేటుగా చేర్చుకొనవచ్చును.

విశదీకరణ:- ఈ ఖండము యొక్క ప్రయోజనము నిమిత్తము, కలకత్తాలోని ఉన్నత న్యాయ స్థానము, పరీక్ష స్వభావము మరియు దానికి సంబంధించిన ఏదేని ఇతర విషయమును నిర్దిష్టపరచుచు;

(ii) ఈ చట్టపు నిబంధనలననుసరించి అట్టి నమోదు కొరకు దరఖాస్తు చేసినట్లయితే; మరియు

(iii) 24వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండములు (ఎ), (బి), (ఇ) మరియు (ఎఫ్)లలో నిర్దిష్టపరచిన షరతులు నెరవేర్చినట్లయితే,

34వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (2)క్రింద అవసరమగునట్టి నియమములను విహితపరచవచ్చును.

కొన్ని క్రమశిక్షణా ప్రొసీడింగులకు సంబంధించి ప్రత్యేక నిబంధన.

58బి. (1) 1963 సెప్టెంబరు, 1వ తేదీ నుండి, ఉన్నత న్యాయస్థానపు ప్రస్తుత అడ్వకేటుకు సంబంధించిన ఏదేని క్రమశిక్షణాపరమైన ప్రొసీడింగుల విషయములు ఉప-పరిచ్ఛేదము (2)కుగల మొదటి, వినాయింపులో నిబంధించినట్లు తప్ప, ఇపుడున్న అడ్వకేటు ఆ ఉన్నత న్యాయస్థానపు జాబితాలో అడ్వకేటుగా నమోదయినట్లుగా దానికి సంబంధించిన రాజ్య బార్ కౌన్సిలు పరిష్కరించవలెను.

(2) సదరు తేదీకి అవ్యవహిత పూర్వము, ప్రస్తుత అడ్వకేటుకు సంబంధించి, భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద ఏదేని ఉన్నత న్యాయస్థానములో ఏదేని క్రమశిక్షణ విషయమై ఏదేని ప్రొసీడింగు పెండింగులో ఉన్నట్లయితే, 56వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము (1) యొక్క ఖండము (సి) క్రింద తదనురూపమైన బార్ కౌన్సిలు వద్ద పెండింగులో ఉన్నట్లుగా ఆ ఉన్నత న్యాయ స్థానమునకు సంబంధించిన బార్ కౌన్సిలుకు ఆ ప్రొసీడింగు బదిలీ అగును;

1926లోని 38వ చట్టము.

అయితే, ఏదేని అట్టి ప్రొసీడింగులకు సంబంధించి, ఉన్నత న్యాయస్థానము నకు భారతబార్ కౌన్సిళ్ల చట్టము,1926 యొక్క 11వ పరిచ్ఛేదము క్రింద సంఘటితమైన ట్రిబ్యునలు యొక్క నిర్ణయము అందినపుడు, ఆ కేసును ఉన్నత న్యాయస్థానము పరిష్కరించవలెను మరియు ఈ చట్టపు 12వ పరిచ్ఛేదము రద్దుచేయబడనట్లుగా ఆ పరిచ్ఛేదము క్రింద దానికి ఒసగిన అధికారములన్నింటినీ ఉన్నత న్యాయ స్థానము వినియోగించుట శాసన సమ్మతమై ఉండును:

1926లోని 38వ చట్టము.

అంతేకాక, సదరు చట్టము యొక్క 12వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛే దము (4) క్రింద తదుపరి పరిశీలన కొరకు ఏదేని కేసును ఉన్నత న్యాయ స్థానము తిరిగిపంపినపుడు, అది 56వ పరిచ్ఛేదపు ఉప-పరిచ్ఛేదము(1) యొక్క ఖండము (సి) క్రింద తదనురూపమైన బార్ కౌన్సిలు వద్ద పెండింగులో ఉన్నట్లుగా ఉన్నత న్యాయ స్థానమునకు సంబంధించిన రాజ్య బార్ కౌన్సిలుకు ఆ ప్రొసీడింగు బదిలీ అగును.

(3) సదరు తేదీకి అవ్యవహిత పూర్వము, ఈ చట్టము క్రింద ఏదేని రాజ్యములో అడ్వకేటుగా నమోదయిన ఎవరేని ప్లీడరు, వకీలు, ముఖ్తారు లేక అటార్నీకి సంబంధించిన ఏదేని క్రమశిక్షణ విషయమై ఏదేని ప్రొసీడింగు పెండింగులో ఉన్నట్లయితే, ఆయన ఏ రాజ్యములోని జాబితాలో నమోదయినారో ఆ రాజ్య బార్ కౌన్సిలుకు అట్టి ప్రొసీడింగు బదిలీ అగును మరియు అది ఈచట్టము క్రింద ఆయన పై ఉత్పన్నమగు ప్రొసిడింగుగా ఈ చట్టము క్రింద నిర్వహించబడును.

(4) ఈ పరిచ్ఛేదములో "ప్రస్తుత అడ్వకేటు" అనగా భారత బార్ కౌన్సిళ్ల చట్టము, 1926 క్రింద ఏదేని ఉన్నత న్యాయ స్థానపు జాబితాలో అడ్వకేటుగా నమోదై మరియు ఆయన పై ఏదేని క్రమశిక్షణా విషయమునకు సంబంధించిన ఏదేని ప్రొసీడింగు ప్రారంభింపబడినపుడు ఈచట్టము క్రింద రాజ్యజాబితాలో అడ్వకేటుగా నమోదు చేయబడని వ్యక్తి అని అర్థము.

1926లోని 38వ చట్టము.

(5) ఈచట్టములో ఏమి ఉన్నప్పటికిని, ఈ పరిచ్ఛేదపు నిబంధనలు అమలు కలిగిఉండును.

J-152-14

ఇబ్బందులను తొలగించుట.

59. (1) ఈ చట్టపు నిబంధనలను, ప్రత్యేకించి ఈ చట్టముచే రద్దు చేయబడిన శాసనముల నుండి చట్టము యొక్క నిబంధనల మార్పు అమలుకు ఏదేని ఇబ్బంది ఏర్పడినట్లయితే, కేంద్ర ప్రభుత్వము, అధికార గెజెటులో ప్రచురించిన ఉత్తరువు ద్వారా, ఆ ఇబ్బందిని తొలగించుటకు అవసరమని లేక ఉపయుక్తమని వారికి తోచునట్లు, ఈ చట్టపు ప్రయోజనములకు అసంగతము కానట్టి నిబంధనలు చేయవచ్చును.

(2) 1961, డిసెంబరు 1వ తేదీకి ముందు కానట్టి తేదీనుండి గతకాలిక ప్రభావముతో అమలుచేయుటకుగాను, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద ఉత్తరువును చేయ వచ్చును.

నియమములు చేయుటకు కేంద్ర ప్రభుత్వము యొక్క అధికారము.

60. (1) ఈ చట్టము క్రింద ఏదేని విషయమునకు సంబంధించి రాజ్యబార్ కౌన్సిలు నియమములు చేయునంత మరియు వాటిని భారత బార్ కౌన్సిలు ఆమోదించునంత వరకు, ఆ విషయమునకు సంబంధించి నియమములు చేయు అధికారము కేంద్రప్రభుత్వ-ముచే వినియోగింపబడదగి ఉండును.

(2) కేంద్రప్రభుత్వము భారత బార్ కౌన్సిలును సంప్రదించిన తరువాత, అధికార గెజెటులో అధిసూచన ద్వారా, ఏదేని రాజ్య బార్ కౌన్సిలుకుగాని, సాధారణముగా అన్ని రాజ్య బార్ కౌన్సిళ్లకుగాని, ఉప-పరిచ్ఛేదము (1) క్రింద నియమములు చేయవచ్చును. మరియు అట్లు చేసిన నియమములు ఈ చట్టములో ఏమి ఉన్నప్పటికిని అమలు కలిగి వుండును.

(3) ఏదేని విషయమునకు సంబంధించి కేంద్ర ప్రభుత్వము ఈ పరిచ్ఛేదము క్రింద నియమములు చేసినపుడు మరియు అదే విషయమునకు సంబంధించి రాజ్య బార్ కౌన్సిలు నియమములు చేసినపుడు, భారత బార్ కౌన్సిలు వాటిని ఆమోదించినపుడు, కేంద్ర ప్రభుత్వము, అధికార గెజెటులో అధిసూచన ద్వారా, అట్టి విషయమునకు సంబంధించి తానుచేసిన నియమములు, అధిసూచనలో నిర్దిష్టపరచునట్టి తేదీనుండి ఆ బార్ కౌన్సిలుకు సంబంధించి అమలులో ఉండుట ఆగిపోవునని ఆదేశించవచ్చును మరియు అట్టి అధిసూచన జారీ అయిన మీదట, కేంద్ర ప్రభుత్వము చేసిన నియమములు, తదనుసారము, సదరు తేదీకి ముందు చేసిన లేక చేయకుండిన పనుల విషయములో తప్ప, అమలు ఆగిపోవును.

## అనుసూచి

## 50(5) పరిచ్ఛేదము చూడుము

## కొన్ని శాసనముల రద్దు.

| | సంగ్రహనామము | రద్దు యొక్క వ్యాప్తి |
|---|---|---|
| 1. | న్యాయవాదుల (మహిళలు) చట్టము,1923 (1923లోని 23వ చట్టము) | మొత్తము |
| 2. | న్యాయవాదుల (ఫీజు) చట్టము,1926 (1926లోని 21వ చట్టము) | మొత్తము |
| 3. | రాష్ట్రముల పునర్ వ్యవస్థీకరణ చట్టము, 1956 (1956లోని 37వ చట్టము) | 53వ పరిచ్ఛేదము. |
| 4. | బొంబాయి పునర్ వ్యవస్థీకరణ చట్టము, 1960 (1960లోని 11వ చట్టము) | 31వ పరిచ్ఛేదము. |